ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5



విశాఖపట్నం

జిల్లా వార్తలు

గురువారం 10 ఏప్రిల్ 2025



జగదాంబ జంక్షన్ వద్ద డ్రోన్ ఆపరేటింగ్‌పై పోలీసులకు శిక్షణ

కేజీహెచ్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

రోగులకు అందుతున్న సేవలపై ఆరా



వైద్య సేవల వివరాలను కలెక్టర్‌కు వివరిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్

మహారాణిపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ బుధవారం కేజీహెచ్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఉదయం ఆస్పత్రికి వెళ్లిన ఆయన పలు విభాగాలకు వెళ్లి, అక్కడ అందుతున్న సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ముందుగా ఓపీ కౌంటర్ ద్వారా అందుతున్న సేవలను పర్యవేక్షించారు. ఓపీ టోకెన్ తీసుకునేందుకు ఎంతసేపు నిరీక్షించాల్సి వస్తోంది?, అభయ్ యాప్ ద్వారా ఓపీ టోకెన్‌ల జారీ, హెల్ప్ డెస్క్ సిబ్బంది సహకరిస్తున్నారా? లేదా?, అక్కడ సదుపాయాలు, ఇతర అంశాలపై పలువురు రోగులతో మాట్లాడారు. వైద్య సేవలు, ఇతర మౌలిక సదుపాయాలు అందుతున్నాయా? లేదా? అంటూ వారి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, ఆర్ఎంవో డాక్టర్ మెహర్ కుమార్ రోగులకు అందిస్తున్న సేవలను కలెక్టర్‌కు వివరించారు.

అడ్వంచర్స్ స్పోర్ట్స్ నిర్వాహకుడు కాశీపై కేసు

- ఈతకొలనులో బాలుడి మృతికి యాజమాన్య నిర్లక్ష్యమే కారణమని విచారణలో వెల్లడి
- ఏసీపీ లక్ష్మణమూర్తి



ఏసీపీ లక్ష్మణమూర్తి

- 6లో

తీరం.. మురికికూపం

సముద్రంలోకి మానవ వ్యర్థాలు

- యూజీడీ వ్యర్థాల శుద్ధి ప్రక్రియలో భాగంగా బీచ్‌రోడ్డులో పలుచోట్ల పంప్‌హౌస్‌ల ఏర్పాటు
- పాండురంగాపురం పంప్‌హౌస్‌లో పనిచేయని మోటార్లు
- దాంతో పైపుల ద్వారా నేరుగా సముద్రంలోకి వదిలేస్తున్న సిబ్బంది
- దుర్వాసనతో పర్యాటకుల అవస్థలు
- పట్టించుకోని జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు



శుద్ధి చేయని వ్యర్థాలు సముద్రంలోకి విడుదల

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా సముద్ర తీరం మురికికూపంగా మారుస్తోంది. నగరానికి మణిహారంగా భావించే ఆర్కే బీచ్‌తోపాటు సముద్రజలాల పరిరక్షణకు కృషిచేయాల్సిన అధికారులు...చేజేతులా భ్రష్టుపట్టిస్తున్నారు. వ్యర్థాలను శుద్ధి చేయకుండా పంప్‌హౌస్‌ల నుంచి నేరుగా సముద్రంలోకి వదిలేస్తున్నారు.



బీచ్ వద్ద పనిచేయని యూజీడీ కేంద్రం

నగరంలో సుమారు రెండు లక్షల ఇళ్లకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) కనెక్షన్లు ఉన్నాయి. ఇళ్లలో ఉత్పత్తి అయ్యే మానవ వ్యర్థాలు నేరుగా డ్రైనేజీలో కలిస్తే పారిశుధ్య సమస్య తలెత్తి వ్యాధులు చుట్టుముట్టే ప్రమాదం ఉండడంతో యూజీడీ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారు. దీనివల్ల మానవ వ్యర్థాలు మరుగుగొడ్డి నుంచి యూజీడీ పైప్‌లైన్ ద్వారా సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లకు చేరతాయి. అక్కడ మోటార్లతో ప్రత్యేక ప్రక్రియ ద్వారా శుద్ధి చేస్తారు. యూజీడీ ద్వారా వచ్చే వ్యర్థాల్లోని ప్రమాదకరమైన వాయువులతోపాటు టాక్సిన్‌లను తొలగించిన తర్వాత ఆ నీటిని నగరంలో మొక్కల పెంపకానికి, పరిశ్రమల అవసరాలకు కేటాయిస్తుంటారు. మిగిలిపోయిన నీటిని సముద్రంలోకి విడిచిపెడుతుంటారు. దీనికోసం నగరంలో 225 ఎంఎల్‌డీ యూజీడీ వ్యర్థాలను శుద్ధి చేసే సామర్థ్యం కలిగిన 18 ఎస్‌టీపీలు ఉన్నాయి. బీచ్‌రోడ్డు పరిసరాల్లోని నివాసాలు, హోటళ్లు, లాడ్జిలు, గెస్ట్‌హౌస్‌ల నుంచి ఉత్పత్తి అయ్యే వ్యర్థాలు పల్లంలో ఉన్న సముద్రంలోకి వెళ్లిపోయే అవకాశం ఉన్నందున...ఆ ప్రాంతంలో ఐదు చోట్ల యూజీడీ పంప్‌హౌస్‌లను ఏర్పాటుచేశారు. పాండురంగాపురం డౌన్‌లో రెండు, పాత మునిసిపల్ కార్యాలయం, పెదజాలరిపేట, సాగర్‌నగర్ వద్ద ఒక్కొక్కటి చొప్పున బీచ్‌రోడ్డును ఆనుకుని పెద్ద సంప్ వెల్‌లను నిర్మించారు. బీచ్‌కు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే యూజీడీ వ్యర్థాలన్నీ ఆయా సంప్ వెల్స్‌లోకి చేరితే అక్కడ నుంచి మోటార్ల ద్వారా పాతనగరం, అప్పుఘర్‌లోని ఎస్‌టీపీలకు పంపింగ్ చేసి శుద్ధి చేస్తారు. ఈ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ముగ్గురు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లతోపాటు ప్రతి పంప్‌హౌస్‌కు ఒక ఏఈ స్థాయి అధికారి ఉంటారు. యూజీడీ పంప్‌హౌస్‌లలోని మోటార్లు నిరంతరం పనిచేయాల్సి ఉండడంతో తరచూ మరమ్మతులకు గురవుతుంటాయి. అయితే అక్కడ ఉండే సిబ్బందితోపాటు పర్యవేక్షించాల్సిన ఇంజనీరింగ్ అధికారులు ఈ సమస్యను ... మిగతా 6వ పేజీలో

డ్రోన్‌లతో నిఘా

ఇప్పటికే రెండు వినియోగం

- మరో ఆరింటిని సమకూర్చుకున్న పోలీసులు
- ఒక్కో సబ్ డివిజన్‌కు ఒక్కొక్కటి కేటాయింపు
- ట్రాఫిక్, క్రైమ్ విభాగాలకు చెరొకటి...
- ప్రస్తుతం వినియోగంపై శిక్షణ
- ఆకతాయిల ఆగడాలకు, నిర్మానుష్య ప్రాంతాల్లో గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగానికి అడ్డుకట్ట

విశాఖపట్నం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నగర పోలీసులు నిఘా కోసం ఇకపై మరిన్ని డ్రోన్‌లను వినియోగించనున్నారు. ఇప్పటికే రెండు అందుబాటులో ఉండగా, సీఎస్ఆర్ కింద మరో ఆరు డ్రోన్‌లను సమకూర్చుకున్నారు. ఒక్కో సబ్ డివిజన్‌కు ఒక్కొక్కటి, ట్రాఫిక్, క్రైమ్ విభాగాలకు చెరొకటి కేటాయించారు. ఆయా డ్రోన్‌ల వినియోగంపై సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు. డ్రోన్‌ల వినియోగంపై నలుగురు కానిస్టేబుళ్లు కొన్నాళ్ల కిందట విజయవాడ వెళ్లి వారం రోజులపాటు శిక్షణ పొందారు. వారి ద్వారా నగరంలో 55 మందికి శిక్షణ ఇప్పించాలని సీపీ శంఖబ్రతబాగ్చి నిర్ణయించారు. ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్‌తోపాటు క్రైమ్ విభాగాల నుంచి 55 మందిని ఎంపిక చేసి వారికి దఫదఫాలుగా శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. డ్రోన్‌లను ఎలా ఎగురవేయాలి, వాటి ద్వారా రికార్డింగ్ ఎలా చేయాలి, డ్రోన్‌లను తిరిగి ల్యాండింగ్ ఎలా చేయాలి?...అనే అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. బుధవారం జగదాంబ జంక్షన్‌లో జనం రద్దీగా ఉన్నప్పుడు డ్రోన్‌లను వినియోగించడంపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. త్వరలోనే ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోనూ, క్రైమ్ బీట్ కానిస్టేబుళ్లు సైతం వినియోగించేలా చిన్నపాటి డ్రోన్‌లను సమకూర్చుకోవాలని సీపీ నిర్ణయించినట్టు తెలిసింది. డ్రోన్‌లు అందుబాటులోకి వస్తే ఆకతాయిల ఆగడాలతోపాటు నిర్మానుష్య ప్రాంతాల్లో గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగం, జూదం వంటి వాటికి అడ్డుకట్ట వేయడం సులభమవుతుందని పోలీసులు భావిస్తున్నారు.

జూన్ నుంచి ఈ-పాస్‌పోర్టులు

మొబైల్ వ్యాన్ ద్వారా కూడా త్వరలో సేవలు

- విదేశాలకు వెళ్లేవారి పాస్‌పోర్టుకు కనీసం ఆరు నెలలు వ్యాలిడిటీ ఉండాలి
- ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో ఒక కేంద్రం
- పాస్‌పోర్టు అనేది విలువైన డాక్యుమెంట్... చాలా జాగ్రత్తగా ఉంచుకోవాలి
- 'ఆంధ్రజ్యోతి'తో విశాఖపట్నం ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం అధికారిణి విశ్వంజలి గైక్వాడ్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ





ఆర్‌పీఓ విశ్వంజలి గైక్వాడ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం జూన్ నెల నుంచి ఈ-పాస్‌పోర్టులు జారీ చేయనుందని పాస్‌పోర్టు అధికారిణి విశ్వంజలి గైక్వాడ్ తెలిపారు. అలాగే మొబైల్ వ్యాన్ ద్వారా కూడా పాస్‌పోర్టు సేవలు అందించనున్నామని చెప్పారు. తాజాగా విజయవాడలో ఈ సదుపాయం ప్రారంభించారని, విశాఖపట్నం నుంచి పంపిన ప్రతిపాదనలకు కూడా ఆమోదం లభించిందన్నారు. వాహనం వచ్చిన తరువాత అది ఏ యే రోజుల్లో ఎక్కడెక్కడ తిరుగుతుందనే విషయం పత్రికా ముఖంగా తెలియజేస్తామన్నారు. ఆమె బుధవారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడుతూ పాస్‌పోర్టులకు సంబంధించి అనేక విషయాలు వెల్లడించారు. విశాఖపట్నం కార్యాలయం పరిధిలో పది జిల్లాలు ఉన్నాయని, శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకు, కేంద్ర పాలిత ప్రాంత యానాంకు కూడా తామే సేవలు అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో పాస్‌పోర్టుల కోసం ఒక కేంద్రం ఏర్పాటుచేశామని చెప్పారు.

ప్రశ్న: ఈ-పాస్‌పోర్టుల జారీ చేస్తామని ఎప్పటి నుంచో చెబుతున్నారు. ఆలస్యానికి కారణం?

జవాబు: దశల వారీగా అమలు చేసుకుంటూ వస్తున్నారు. హైదరాబాద్, భువనేశ్వర్, నాగపూర్‌లలో ఈ-పాస్‌పోర్టులు ఇస్తున్నారు. తరువాత దశలో విశాఖపట్నం ఉంది. జూన్ నుంచి కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి ఈ-పాస్‌పోర్టులే అందిస్తాం. అలాగే రెన్యువల్‌కు వచ్చే వారికి కూడా అవే ఇస్తాం.

ప్ర: ఈ-పాస్‌పోర్టు అంటే..?

జ: పాస్‌పోర్టుపై ఎలక్ట్రానిక్ చిప్ అమర్చి ఇస్తారు. స్కాన్ చేయగానే ఆ వ్యక్తి వ్యక్తిగత సమాచారం, బయోమెట్రిక్ వివరాలన్నీ కంప్యూటర్‌లో డిస్‌ప్లే అవుతాయి. దీనిని రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ (ఆర్ఎఫ్ఐడీ) ఫీచర్‌తో తీసుకువస్తున్నారు.

ప్ర: పాస్‌పోర్టు అత్యవసరమైతే ఏమి చేయాలి?

జ: విదేశాలకు అత్యవసరంగా చికిత్సకు లేదా ఇతర కారణాలపై వెళ్లాలనుకునేవారు, అడ్మిషన్ల కోసం విదేశాలకు వెళ్లే విద్యార్థులకు పాస్‌పోర్టు అర్జంట్‌గా ... మిగతా 6వ పేజీలో

ఫిల్మ్ క్లబ్ పరువు పాయె

ఇటీవల ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్

- కార్యవర్గ సభ్యుల సమక్షంలో నామినేషన్లు పత్రాలు ఉన్న బాక్స్‌ను ఓపెన్ చేసిన ఉద్యోగి
- సోషల్ మీడియాలో వైరల్
- ...ఈ పరిణామాల నేపథ్యంలో వ్యక్తిగత కారణాల వల్ల ఎన్నికల నిర్వహణ బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్టు సీనియర్ న్యాయవాది ప్రకటన
- ఎన్నికల ప్రక్రియ రద్దు చేస్తున్నట్టు గౌరవ కార్యదర్శి వెల్లడి



వైజాగ్ ఫిల్మ్ క్లబ్

విశాఖపట్నం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): **వైజాగ్ ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్ పరువు గంగలో కలిసిపోయింది. వైసీపీ నేతలు కార్యవర్గంలో ప్రవేశించిన తరువాత క్లబ్ స్థాయి పడిపోయింది. కమీషన్ల వ్యవహారం ఎక్కువైపోయింది.**

క్లబ్ అధ్యక్షుడు కాయల వెంకటరెడ్డి, కోశాధికారి గోపీనాథ్‌రెడ్డి పదవులకు రాజీనామా చేసి నెలలు గడిచినా వాటిని ఆమోదించకుండా రాజకీయం చేశారు. ఎట్టకేలకు ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చారు. నామినేషన్లు స్వీకరించారు. అయితే కార్యవర్గ సభ్యుల సమక్షంలోనే ఒకరు నామినేషన్ల బాక్స్ ఓపెన్ చేసిన వీడియో బయటకు వచ్చింది. దానిని కూడా సదరు వ్యక్తులు సమర్థించుకుంటూ మంగళవారం పోటీదారులకు లేఖ రాశారు. నామినేషన్ల ప్రక్రియ పారదర్శకంగా చేశామని, ఎవరి నామినేషన్లు వారు చెక్ చేసుకోవాలని, ఎలాంటి మార్పులు చేయలేదని సురేందర్‌రెడ్డి లేఖలు రాశారు. 24 గంటలు గడవక ముందే ఈ ఎన్నికలకు అధికారిగా వ్యవహరించిన సీనియర్ న్యాయవాది కె.నరసింహమూర్తి వ్యక్తిగత కారణాల వల్ల తాను ఆ బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించారు. ఈ విషయాన్ని గౌరవ కార్యదర్శి శ్రీనివాసరాజు బుధవారం ఒక ప్రకటనలో స్పష్టంచేశారు. అంతేకాకుండా ఎన్నికల ప్రక్రియ వివాదాస్పదంగా మారిందని, అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, అందువల్ల ఈ ఎన్నికల ప్రక్రియను పూర్తిగా రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. తరువాత కొత్తగా ఎన్నికల తేదీ ప్రకటిస్తామని వెల్లడించారు. విశాఖపట్నంలో ప్రముఖులు సభ్యులుగా ఉన్న ఒక క్లబ్‌పై ఈ స్థాయిలో విమర్శలు రావడం ఇదే తొలిసారి. ఇప్పటికీ దీనిని తమ గుప్పిట్లో ఉంచుకోవాలని వైసీపీ నేతలు యత్నించడం, వారికి తెర వెనుక కూటమి నాయకులు సహకరించడం ఇక్కడ గమనించాల్సిన అంశం. ఈ క్లబ్‌లో వైసీపీ పెత్తనం పెరిగిపోయిందని ఆరోపించిన నాయకులు ఎవరూ ఇప్పుడు దీనిపై మాట్లాడకపోవడం గమనార్హం.

ఎన్నికల ప్రక్రియలో అవకతవకలపై వీడియో పుటేజీ ఉంది. దానిని పోలీసులకు ఇచ్చి విచారణ చేయిస్తే అందరి బాగోతం బయటపడుతుంది. కానీ కార్యవర్గం పెద్దలు ఆ పని చేయడం లేదు. ఇప్పటికే క్లబ్ పరువు పోయిందని, ఇంకా దిగజారిపోతుందని ఆందోళన చెందుతున్నారు. ఇంత జరుగుతున్నా ఒక్కరు కూడా ముందుకువచ్చి ఏమి జరిగిందో వెల్లడించకపోవడం గమనార్హం.



విమానాశ్రయంలో కార్పొరేటర్లు

టీడీపీ కార్పొరేటర్లు మలేషియా పయనం

విశాఖపట్నం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్పొరేటర్లు మలేషియా వెళ్లారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై కూటమి కార్పొరేటర్లు ఇచ్చిన అవిశ్వాస తీర్మానం నోటీస్‌పై ఈనెల 19న కౌన్సిల్ సమావేశం జరగనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తమ కార్పొరేటర్లు చేజారిపోకుండా ఇటు కూటమి, అటు వైసీపీ నేతలు జాగ్రత్త పడుతున్నారు. వైసీపీ కార్పొరేటర్లను రెండు వారాల కిందటే బెంగళూరు తరలించారు. తాజాగా టీడీపీకి చెందిన 26 మంది కార్పొరేటర్లు, వారి కుటుంబసభ్యులు బుధవారం ప్రత్యేక విమానంలో మలేషియా వెళ్లారు. మరికొందరు ఒకటి, రెండు రోజుల్లో మలేషియా వెళ్లనున్నారు. జనసేన కార్పొరేటర్లు మాత్రం క్యాంపునకు దూరంగా ఉండాలని నిర్ణయం తీసుకున్నారు.

భీమిలి బీచ్ రోడ్డులో డబుల్ డెక్కర్ బస్సులు

కింద క్లోజ్డ్ డోర్స్ పైన ఓపెన్ టాప్...

- వారం రోజుల్లో రాక
- నిర్వహణకు ప్రాజెక్టు మానటరింగ్ యూనిట్ ఏర్పాటు
- పర్యాటకానికి కొత్త హంగులు



డబుల్ డెక్కర్‌బస్సు (ఫైల్)

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నంలో పర్యాటక రంగానికి కొత్త రంగులు అద్దడానికి జిల్లా యంత్రాంగం ప్రయత్నం చేస్తోంది. బీచ్ రోడ్డులో 'హాప్ ఆన్,హాప్ ఆఫ్' బస్సులు నడిపితే బాగుంటుందని ఏపీ టూర్స్ అండ్ ట్రావెల్స్ ప్రతినిధులు చాలాకాలంగా సూచిస్తున్నారు. దీనిపై ప్రస్తుత కలెక్టర్ హరేంధిర ప్రసాద్ దృష్టిపెట్టారు. విశాఖపట్నం పోర్టుతో సంప్రతింపులు జరిపి పర్యావరణ సామాజిక బాధ్యత కింద రెండు ఎలక్ట్రిక్ బస్సులు ఇవ్వాలని కోరగా, పోర్టు యాజమాన్యం అంగీకరించింది. ఇవి డబుల్ డెక్కర్ బస్సులు. పూర్తి ఏసీ కలిగి ఉంటాయి. కింద క్లోజ్డ్ డోర్స్‌తో, పైన ఓపెన్ టాప్‌తో ఉంటాయి. వీటి ఖరీదు ఒక్కొక్కటి సుమారు రూ.1.8 కోట్లు. వీటితో పాటు అశోక్ లేల్యాండ్ నుంచి ఒక ఏసీ బస్సు వస్తుంది. రాష్ట్ర ప్రభుత్వానికి ఆ సంస్థ కొన్ని ఏసీ బస్సులు ఇవ్వడానికి ముందుకు రాగా అందులో ఒకటి విశాఖపట్నం పంపుతామని అమరావతి అధికారులు తెలిపారు. దీంతో కలుపుకొని మొత్తం మూడు బస్సులు పర్యాటక శాఖకు అందనున్నాయి. వీటిని బీచ్ రోడ్డులో ఫిషింగ్ హార్బర్ నుంచి భీమిలి వరకూ నడుపుతారు. రూట్లు, స్టాపులు, అవసరమైన అనుమతులపై రవాణా శాఖ, ఆర్టీసీ అధికారులతో చర్చించాలని కలెక్టర్ సూచించారు. వీటి నిర్వహణకు ప్రాజెక్టు మానటరింగ్ యూనిట్ (పీఎంయు) ఏర్పాటు చేస్తారని సమాచారం. వాల్తేరులోని ఆర్టీసీ డిపోలో ఈ బస్సులకు ... మిగతా 6వ పేజీలో

కిరండూల్ రైళ్ల గమ్యం కుదింపు

విశాఖపట్నం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస-కిరండూల్ (కేకే) లైనులో ఆధునికీకరణ పనులు చేపడుతున్న నేపథ్యంలో విశాఖ-కిరండూల్ మధ్య రాకపోకలు సాగించే రైళ్ల గమ్యాలను తాత్కాలికంగా కుదించామని వాల్తేరు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖ-కిరండూల్ మధ్య నడిచే 58501, 58502 నంబర్లు గల పాసింజర్ రైళ్లు ఈ నెల 14 నుంచి 22 వరకు విశాఖ-అరకు మధ్య రాకపోకలు సాగిస్తాయని ఆయన పేర్కొన్నారు. అరకు-కిరండూల్ మధ్య రాకపోకలను రద్దు చేశామన్నారు. అలాగే విశాఖ-కిరండూల్ మధ్య నడిచే 18515, 18516 నంబర్లు గల నైట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈ నెల 15 నుంచి 23 వరకు విశాఖ-దంతెవాడ మధ్య నడుస్తాయన్నారు. దంతెవాడ-కిరండూల్ మధ్య రాకపోకలను తాత్కాలికంగా రద్దు చేశామని పేర్కొన్నారు. ఈ మార్పులను ప్రయాణికులు గమనించాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భీమునిపట్నం (రూరల్), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్నవరం పరిధిలో విద్యుత్ నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అన్నవరం, కంచేరుపాలెం, పెదనాగమయ్యపాలెం, చిననాగమయ్యపాలెం, ఎర్రయ్యపాలెం, ఆశిపాలెం, ఎన్‌టీఆర్ కాలనీకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

భీమునిపట్నంలో...

భీమునిపట్నం : పట్టణంలోని నాలుగో వార్డు చేపలుప్పాడ 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆ శాఖాధికారులు తెలిపారు.పాతపరదేశిపాలెం, కాపులుప్పాడ, కల్లివానిపాలెం, చిలుకూరి లేఅవుట్, శ్రీప్రకాష్, విలాసం లేఅవుట్, పెద ఉప్పాడ, చినఉప్పాడ, గంగడిపాలెం, గోవుపేట, పాతూరు, కొత్తూరు, చేపలదిబ్బడిపాలెం, బోయిలూరు, పెద్ద బస, కె. నేరేళ్లవలస, నేరెళ్లవలసకు సరఫరా ఉండదన్నారు.

ఉపకార వేతనాలపై అవగాహన

సాగర్‌నగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పలు కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులకు గీతం యూనివర్సిటీలో అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) అందిస్తున్న సరస్వతి స్కాలర్ షిప్‌లు, ఇతర ఉపకార వేతనాల గురించి బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐసీటీఈ కార్యదర్శి డాక్టర్ రాజీవ్ కుమార్ మాట్లాడుతూ ఉన్నత విద్య అభ్యసిస్తున్న వారికి భవిష్యత్తులో ఉన్న అవకాశాలు, వివిధ సంస్థలు అందిస్తున్న ఉపకార వేతనాలు గురించి వివరించారు. సరస్వతి స్కాలర్ షిప్ దేశంలో ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోని నిరుపేద విద్యార్థినులకు అందిస్తున్న పథకమని చెప్పారు. ఈ కార్యక్రమంలో గీతం ప్రో వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, గీతం ఐక్యూఏసీ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజా ప్రభు, ఏఐసీటీఈ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సీపీఐ నేత రాజేశ్వరరావుకు నివాళి


నివాళి అర్పిస్తున్న నాయకులు

మధురవాడ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ జాతీయ మాజీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే చండ్ర రాజేశ్వరరావు కార్మికుల హక్కుల కోసం ఎనలేని పోరాటం చేశారని ఆ పార్టీ మధురవాడ ఏరియా కార్యదర్శి వాండ్రాసి సత్యనారాయణ అన్నారు.రాజేశ్వరరావు 31వ వర్ధంతి సభను బుధవారం మధురవాడ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దున్నేవాడిదే భూమి అన్న నినాదంతో నిరంతరం ప్రజా పక్షాన పోరాడడమే కాకుండా కార్మిక చట్టాల రూపకల్పనకు ఎమ్మెల్యేగా కృషి చేశారని కొనియాడారు. అనంతరం నాయకులు రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.


ఆక్రమణ వల్ల చిన్న కాలువ మాదిరిగా కనిపిస్తున్న సుద్దగెడ్డ



ఆక్రమణలో గెడ్డలు

- నానాటికీ తగ్గిపోతున్న విస్తీర్ణం
- ఒకప్పుడు 60 అడుగుల వెడల్పు.. ప్రస్తుతం 20 అడుగులకే పరిమితం
- స్పందించని అధికారులు

విశాఖపట్నం, ఏప్రిల్ 9, (ఆంధ్రజ్యోతి) : రుషికొండ పరిసర ప్రాంతాల్లో ఉన్న గెడ్డలు ఆక్రమణకు గురవుతున్నాయి. ఈ ప్రాంతంలోని భూములకు డిమాండ్ ఉండడంతో ఎక్కడ చిన్న ప్రభుత్వ స్థలం కనిపించినా..ఆక్రమణదారులు విడిచిపెట్టడం లేదు. ఒకవైపు ఐటీ హబ్, మరోవైపు సముద్రతీరం, సమీపంలో ప్రముఖ పర్యాటక ప్రాంతాలు ఉండడంతో ఇక్కడి భూములకు ఎప్పుడూ డిమాండ్ ఉంటోంది. ఈనేపథ్యంలో ఖాళీ స్థలాలతో పాటు గెడ్డలను కూడా కబ్జా చేస్తున్నారు. ఇందుకు సుద్దగెడ్డ ఆక్రమణలే నిదర్శనం. మధురవాడ నుంచి స్వర్ణభారతినగర్ మీదుగా బీచ్ రోడ్డు దాటుకుని సుద్దగెడ్డ ప్రవహిస్తోంది. మరో గెడ్డ ఎండాడ నుంచి ఒమ్మివానిపాలెం మీదుగా చిన్న రుషికొండ వరకు ఉంది. ఈ ప్రాంతంలోని భూములకు అధిక ధర ఉండడంతో అక్రమార్కుల కన్ను ఈగెడ్డలపై పడింది. ఓ గెడ్డ రుషికొండ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 28 పరిధిలోకి రాగా, మరో గెడ్డ సర్వే నెంబరు 17 పరిధిలోకి వస్తుంది. రెండు గెడ్డలు గతంలో సుమారు 60 అడుగుల వెడల్పుతో ప్రవహించేవి. ప్రస్తుతం 20 అడుగులకు కుదించుకుపోయాయంటే ఏ స్థాయిలో ఆక్రమణకు జరిగాయో అర్థం చేసుకోవచ్చు. గెడ్డల ప్రవాహం పొడవునా ఆక్రమణలు చోటుచేసుకున్నాయి.ఆక్రమణల వల్ల కొన్నిచోట్ల గెడ్డలు మురుగునీటి కాలువల మాదిరిగా కనిపిస్తున్నాయి. చాలా వరకూ కబ్జా కావడంతో వర్షా కాలంలో నీటి ప్రవాహానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వరద ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు గెడ్డలోని నీరు కాలనీల్లోకి వస్తుంది.

నాయకుల అండతోనే..

స్థానికంగా ఉన్న కొందరు నాయకుల అండతోనే గెడ్డలు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఈ ప్రాంతంపై మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రభావం ఎక్కువగా ఉండడంతో ఓ నాయకుడు తన భూములు చుట్టూ ఉన్న గెడ్డలను కప్పి, జీవీఎంసీ నిధులతో రోడ్లు వేయించుకున్నారన్న విమర్శలు వున్నాయి. తాజాగా స్వర్ణభారతినగర్ వద్ద సుద్దగెడ్డను కూడా కబ్జా చేయడానికి బ్రిడ్జి వద్ద డెబ్రిస్ పోగులు వేసి ఉంచారు.ఈ స్థలాన్ని కూడా కబ్జా చేసే ప్రయత్నాలు జరుగుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే ఒమ్మివానిపాలెం గెడ్డ వద్ద కొత్తగా నిర్మించిన బ్రిడ్జికు ఆనుకొని వున్న తాటి చెట్లను నరికి, అక్కడి స్థలాన్ని మట్టితో కప్పుతున్నారు. గతంలో కూడా ఈ ప్రాంతానికి కాస్త దూరంలో గెడ్డను డెబ్రిస్‌తో కప్పి ఆక్రమణకు పాల్పడితే అప్పటి జాయింట్ కలెక్టర్ చర్యలు తీసుకుని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. బ్రిడ్జికు ఆనుకొని వున్న గెడ్డ స్థలాన్ని కూడా ఇదే తరహాలో ఆక్రమించేందుకు ప్రయతిస్తున్నారు.

అధికారులు తక్షణమే ఆక్రమణలపై దృష్టి సారించి, గెడ్డల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న జడ్పీ కనక మహాలక్ష్మి, కూటమి నాయకులు

కార్పొరేషన్ రుణాల దరఖాస్తులు పరిశీలన

కొమ్మాది, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోసం వివిధ కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరు చేస్తుందని పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి శ్రీనివాస్ అన్నారు. కార్పొరేషన్ రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను పీఎంపాలెంలోని అవంతి ఫంక్షన్ హాల్‌లో బుధవారం పరిశీలించారు. జోన్ 2 పరిధిలో సుమారు 2907 మంది దరఖాస్తులు అందజేశారని జడ్పీ కనక మహాలక్ష్మి తెలిపారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు గరే గురునాథ్, ఆరో వార్డు జనసేన అధ్యక్షుడు సంతోష్‌నాయుడు, మామిడి దుర్గారావు, లొడగల జానకీరామ్, లొడగల రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు జగన్ క్షమాపణ చెప్పాలి

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు



భీమునిపట్నం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పోలీసుల గురించి అసభ్యకరంగా మాట్లాడడం సరికాదని, తక్షణమే ఆయన వారికి క్షమాపణ చెప్పాలని టీడీపీ రాష్ట్రకార్యదర్శి గంటా నూకరాజు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పోలీసులను గుడ్డలు ఊడదీసి కొడతామని, అధికారంలోకి తాము వస్తే మొత్తం పోలీసులను తొలగిస్తామని హెచ్చరించడం జగన్ అవివేకానికి నిదర్శనమన్నారు. పోలీసులు లేకపోతే ఏ ఒక్క రాజకీయ నాయకుడు ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేరని గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడడానికి ఎన్నో కష్టాలు ఎదుర్కొంటూ, కుటుంబాలకు కూడా అందుబాటులో లేకుండా అహర్నిశలు శ్రమిస్తున్న పోలీసు వ్యవస్థపై ఇష్టం వచ్చినట్టు మాట్లాడడం ఏమాత్రం తగదన్నారు.


నూతన కార్యవర్గం సభ్యులు

మధురవాడ బిల్డర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

కొమ్మాది, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ రంగంలో సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని మధురవాడ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్ పోతిన శివ అన్నారు. బుధవారం పీఎంపాలెం కూడలి వద్ద మధురవాడ బిల్డర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. చైర్మన్‌గా పోతిన శివ, అధ్యక్షుడిగా ఆర్‌వీ కుమార్, కార్యదర్శిగా కనుమూరి రామకృష్ణ, ట్రెజరర్‌గా పిళ్లా యోహన కృష్ణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ మధురవాడ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని చెప్పారు.

డీవీస్ ఉద్యోగులు రక్తదానం


రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

భీమునిపట్నం (రూరల్), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : చిప్పాడ దివీస్ కర్మాగారంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 1085 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. దాతల నుంచి విశాఖకు చెందిన రెడ్‌క్రాస్, ఎన్‌టీఆర్ బ్లడ్ బ్యాంక్, రోటరీ, న్యూలైఫ్ సంస్థలతో పాటు విజయనగరానికి చెందిన రెడ్‌క్రాస్, శ్రీకాకుళం ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంకుల సిబ్బంది రక్తాన్ని సేక రించారు. కంపెనీ జనరల్ మేనేజరు సత్యచంద్ర దివి జ్ఞాపకార్థం ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ డైరెక్టర్ ఎన్. దేవేంద్రరావు, ఉపాధ్యక్షుడు ఎల్‌వీ రమణ, జనరల్ మేనేజరు వైఎస్ కోటేశ్వరరావు, జనరల్ మేనేజర్లు రమేష్‌బాబు, రామకృష్ణ, నాగార్జున, డీజీఎం ప్రభాకర్, మహేంద్ర, మల్లికార్జున, నరసింహ పాల్గొన్నారు.


ఏఎంసీ చైర్మన్ రామస్వామినాయుడును సత్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా, పంచకర్ల సందీప్

రైతులకు అందుబాటులో ఉండాలి : ఎమ్మెల్యే గంటా

పద్మనాభం/పద్మనాభం రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మార్కెట్ కమిటీలు రైతుల సంక్షేమానికి కృషి చేయాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. భీమిలి ఏఎంసీ చైర్మన్ కురిమిన రామస్వామినాయుడు, జనసేన పార్టీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి పంచకర్ల సందీప్‌తో కలిసి ఎమ్మెల్యే గంటాను భీమిలిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి నాయకులను సమన్వయం చేసుకుంటూ, రైతులకు అందుబాటులో ఉంటూ సేవలందించాలన్నారు. అనంతరం రామస్వామినాయుడును ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు శ్రీనివాసరావు, వీబీ నాయుడు, సూరప్పడు, సోమేష్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

భూములు కోల్పోయిన వారిని ఆదుకోండి

ఆనందపురం : ల్యాండ్ పూలింగ్‌లో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించి న్యాయం చేయాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన భీమిలిలోని తన క్యాంపు కార్యాలయంలో ఆర్‌డీఓ సంగీత్ మాధుర్, తహసీల్దార్ శ్యామ్ ప్రసాద్, రైతులతో సమావేశమయ్యారు. ఆనందపురం మండలం తర్లువాడలో 2002లో బంజరు భూముల అభివృద్ధి పథకం కింద 500 మందికి 100 ఎకరాలు కేటాయించారు. ఐటీ హబ్ కోసం ఈ గ్రామంలో 200 ఎకరాలను ప్రభుత్వం స్వీకరిస్తున్న విషయం విదితమే. ఇప్పటివరకు 100 ఎకరాలు డీపట్టా భూములను అధికారులు సేకరించారు. వంద ఎకరాల్లోని 500 మంది రైతులకు కూడా నష్టపరిహారం ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. రైతులంతా 20 సెంట్లు, 30 సెంట్లు ఉన్న వారు కావడంతో మానవతా దృక్పథంతో వారిని ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో రైతుల తరపున తర్లువాడ సర్పంచ్ బీఆర్‌బీ నాయుడు, తాత్రాజు అప్పారావు, మజ్జి శ్రీను, బంక్ రాజు, బాలి అయ్యప్ప, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


మాట్లాడుతున్న వైద్యాధికారిణి మణికుమారి

పద్మనాభం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు, బాలింతలు బలవర్ధకమైన పోషకాహారం తీసుకోవడం వల్ల పుట్టిన పిల్లల్లో శారీరక, మానసిక ఎదుగుదల ఉంటుందని రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె. మణికుమారి చెప్పారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం రేవిడి పీహెచ్‌సీలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పాలు, పండ్లు, ఆకుకూరలు, చిరుధాన్యాలు వంటి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి ఎన్. సౌజన్య, ఐసీడీఎస్ సూపర్‌వైజరు రాజ్యలక్ష్మి, ఎంపీహెచ్‌ఈఓ కెఎస్ రావు, సూపర్‌వైజరు సతీశ్, హెచ్‌వీ ప్రియదర్శిని, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

చందనోత్సవం విజయవంతానికి కృషి చేయాలి

- సింహగిరిపై అధికారులతో దేవదాయ శాఖ కమిషనర్ సమీక్ష


నిర్మాణాలను పరిశీలిస్తున్న కమిషనర్ రామచంద్రమోహన్

సింహాచలం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 30న జరగనున్న వరాహలక్ష్మీనృసింహస్వామి నిజరూప దర్శనం చందనోత్సవం నిర్వాహణపై దేవదాయశాఖ రాష్ట్ర కమిషనర్ కొడూరి రామచంద్రమోహన్ బుధవారం సింహగిరిపై అధికారులతో సమీక్షించారు.ఉత్సవానికి చేస్తున్న ఏర్పాట్లు, ప్రణాళికలను కార్యనిర్వహణాధికారి కె. సుబ్బారావు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం క్యూల నిడివి, వెడల్పు, అత్యవసర ద్వారాలు, తాగునీటి సరఫరా, తదితర అంశాలను ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు మ్యాప్‌ల ఆధారంగా విశదీకరించారు.

అనంతరం కమిషనర్ అధికారులతో కలిసి నిర్మాణంలోని క్యూ కాంప్లెక్స్, పార్కింగ్ స్థలాలు, ఆలయంలో క్యూల ప్రవేశం, బయటకు వెళ్లే మార్గాలు, భక్తుల రాకపోకల నియంత్రణపై క్షేత్ర పరిశీలన చేశారు. కమిషనర్ వెంట కనక మహాలక్ష్మీ దేవస్థానం ఈఓ కె.శోభారాణి, జిల్లా అసిస్టెంట్ కమిషనర్ అన్నపూర్ణ, డిప్యూటీ కమిషనర్ సుజాత, సింహాచల దేవస్థానం డిప్యూటీ ఈఓ సింగం రాధ, ఏఈఓలు ఎన్. ఆనందకుమార్, రాజేంద్రకుమార్, పి.శ్రీనివాసరావు, తదితరులున్నారు.

అప్పన్న కల్యాణోత్సవంలో నేటి కార్యక్రమాలు

సింహాచలం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి వార్షిక తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 4 గంటలకు సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధన, విశేష హోమాలు, బాలభోగం నివేదన, గ్రామ బలిహరణం చేస్తారు. ఉదయం 7.30 గంటలకు వైదిక సదస్యం, మంగళాశాసనం, 8.00 నుంచి 11.30 వరకు భక్తులకు సర్వదర్శనాలు కల్పిస్తారు. మధ్యాహ్నం 11.30 నుంచి 12.30 గంటల వరకు రాజభోగము మహా నివేదన (దర్శనములు నిలుపుదల చేయుట), 3.00 గంటలకు వేద పండిత సదస్యం, సాయంత్రం 6 గంటలకు సర్వజన మనోరంజని వాహనంపై గ్రామ తిరువీధి, రాత్రి 7 గంటలకు ఆరాధన, విశేష హోమాలు, (దర్శనములు నిలుపుదల), రాత్రి 10 గంటలకు నివేదన, గ్రామ బలిహరణ, మంగళా శాసనం, కవాట బంధనం చేస్తారు.

అలరించిన కూచిపూడి నృత్యాలు


కళాకారిణికి జ్ఞాపిక అందజేస్తున్న అధికారులు

సింహాచలం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి వార్షిక తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా ప్రధాన రాజగోపురానికి సమీపాన ఉన్న కళావేదికపై కళాకారులు చేసిన కూచిపూడి నృత్యాలు భక్తులను అలరించాయి. బుధవారం సాయంత్రం 4 గంటలకు విజయనగరం ప్రాంతానికి చెందిన అభినయ కళా క్షేత్రం నిర్వాహకురాలు బి. మంజూష పర్యవేక్షణలోనూ, సాయంత్రం 5 గంటలకు టి. అన్నమాచార్య సేవా ట్రస్టు నిర్వాహకురాలు సునీత డైరెక్షన్‌లోనూ, సాయంత్రం 6 గంటలకు పాతగాజువాక ప్రాంతానికి చెందిన మాతృశ్రీసాయి సంస్థ వ్యవస్థాపకురాలు రమ్యరిషిత సారధ్యంలోనూ కళాకారులు పలు సంకీర్తనలకు కూచిపూడి నృత్యాలు ప్రదర్శించారు.

బస్ షెల్టర్ నిర్మించాలని వినతి

సింహాచలం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న దర్శనానికి వచ్చే భక్తులకు, గోశాల కూడలి వైపు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం గోశాల కూడలిలో బస్ షెల్టర్ నిర్మించాలని స్థానికులు కోరారు. ఈమేరకు బుధవారం వారు జోనల్-8 కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే కూడలిలో పబ్లిక్ టాయిలెట్స్ కూడా ఏర్పాటు చేయాలని విన్నవించారు.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

జిల్లా సర్వ శిక్షాభియాన్ పీఓ చంద్రశేఖరరావు


వేములవలసలో మాట్లాడుతున్న పీఓ చంద్రశేఖరరావు

ఆనందపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఐదేళ్లు దాటిన పిల్లలను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని జిల్లా సర్వశిక్షాభియాన్ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ జోగా చంద్రశేఖరరావు అన్నారు. బుధవారం ఆయన బొడ్డపాలెం, వేములవలస ఎస్సీ కాలనీలో పర్యటించారు. బొడ్డపాలెంలో ఒకరు, వేములవలస ఎస్సీ కాలనీలో ఇద్దరు బడిఈడు పిల్లలను గుర్తించారు. వేములవలస ఎస్సీ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి, విద్యార్థుల సంఖ్య పెంచాలని కార్యకర్తలకు సూచించారు. అనంతరం ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఆయనతో పాటు ఏఈ శ్రీనివాస్, హెచ్‌ఎం రావు పట్నాయక్,ఏపీఓ అప్పలనాయుడు, ఎంఈఓ - 1 జోగేంద్రనాథ్, సీఆర్‌పీ షిణగం శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

అడ్వెంచర్స్ స్పోర్ట్స్ నిర్వాహకుడు కాశీపై కేసు

సీతంపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : పోర్టు స్టేడియంలోని విశ్వనాథ్ అడ్వెంచర్స్ స్పోర్ట్సు నిర్వాహకుల నిర్లక్ష్యంకారణంగానే రిషిత్ అనే బాలుడు నీటిలో మునిగి మృతిచెందాడని ఏసీపీ లక్ష్మణమూర్తి తెలిపారు. నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ స్పోర్ట్స్ క్లబ్‌లో సీసీ కెమెరాలు, లైఫ్ గార్డ్స్ లేవని తమ దర్యాప్తులో తేలిందన్నారు.సమయం దాటినా టికెట్లు విక్రయించడం, ముందు జాగ్రత్తలు తీసుకోకపోవడం వంటి ఉల్లంఘనలు బయటపడ్డాయన్నారు. ఇక ఏడేళ్ల బాలుడు రిషిత్‌కు సంబంధించి తొలుత అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామన్నారు. అయితే విచారణ అనంతరం స్పోర్ట్స్ కాంప్లెక్స్ యజమాని, నిర్వాహకుడు కాశీవిశ్వనాథ్ తగిన రక్షణ చర్యలు చేపట్టలేదని, ఆయన అజాగ్రత్త వల్ల రితీష్ మృతిచెందినట్టు తేలిందన్నారు. దాంతో బుధవారం సెక్షన్లు మార్చి నిర్వాహకుడు కాశీవిశ్వనాథ్‌పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. యాజమాన్యంపై కోర్టులో అభియోగపత్రం (చార్జిషీట్) దాఖలు చేస్తామన్నారు.

గ్యాస్ ధర పెంపుపై నిరసన

మధురవాడ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధర పెంచడం అన్యాయమని సీపీఐ మహిళా నాయకులు పేర్కొన్నారు. బుధవారం వారు మధురవాడలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలెండర్‌పై రూ. 50 పెంచిందని, తక్షణమే దాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఏ బేగం, వి. లక్ష్మి, షేక్ తనీషా, తదితరులు పాల్గొన్నారు.

భీమిలి బీచ్ రోడ్డులో.. డబుల్ డెక్కర్ బస్సులు

... 5వ పేజీ తరువాయి

అవసరమైన చార్జింగ్ పాయింట్లు కేటాయించాలని రీజనల్ మేనేజర్‌కు సూచించారు. ఈ బస్సులు చూడడానికి చాలా ఆకర్షణీయంగా ఉంటాయి. వాస్తవానికి ప్రస్తుతం బీచ్ రోడ్డులో బస్సులు ఏవీ లేవు. భీమిలి వెళ్లే ఒక బస్సు ఎంవీపీ కాలనీ మీదుగా అప్పుఘర్ చేరి, అక్కడి నుంచి రుషికొండ మీదుగా వెళుతుంది. ఇది కాలేజీ సమయాల్లో పూర్తిగా కిక్కిరిసి ఉంటుంది. పర్యాటకులు ఆర్‌కే బీచ్ నుంచి గానీ, ఫిషింగ్ హార్బర్ నుంచి గానీ రుషికొండ, భీమిలి వెళ్లాలంటే బస్సు సౌకర్యం లేదు. ఇప్పుడు అందమైన బస్సులు అందుబాటులోకి వస్తే బీచ్ టూరిజం పెరుగుతుందని, ముఖ్యంగా సాయంత్రం వేళల్లో డిమాండ్ బాగుంటుందని అధికారులు భావిస్తున్నారు. వీటికి ఆదరణ బాగుంటే మరిన్ని బస్సులు నడిపే ప్రయత్నం చేస్తామని అధికార వర్గాలు తెలిపాయి. ఈ బస్సులు వారం రోజుల్లో విశాఖపట్నం వచ్చే అవకాశం ఉంది.

ఈ-పాస్‌పోర్టులు

... 5వ పేజీ తరువాయి

కావలసి వస్తుంది. అటువంటి వారు వాటికి సంబంధించిన ఆధారాలతో పాటు బుక్ చేసుకున్న విమానం టికెట్ తప్పనిసరిగా సమర్పించాలి. అలా చేస్తే వెంటనే పాస్‌పోర్టు జారీ చేస్తాం. ఇటీవల శ్రీకాకుళం జిల్లాకు చెందిన కొందరు పిల్లలు బాక్సింగ్ పోటీలలో పాల్గొనడానికి విదేశాలకు వెళతామంటే బాక్సింగ్ అసోసియేషన్ ఆ పత్రాలతో దరఖాస్తు చేసింది. వెంటనే ఇచ్చాం.

ప్ర: విదేశీ పర్యటనకు వెళ్లేవారు పాస్‌పోర్టు విషయంలో తీసుకోవలసిన జాగ్రతలు?

జ: విదేశాలకు వెళ్లే వారి పాస్‌పోర్టుకు కనీసం ఆరు నెలల వ్యాలిడిటీ ఉండాలి. అంటే ఆరు నెలల కంటే తక్కువ సమయంలో అది ఎక్స్‌పైర్ అయిపోతుందనుకుంటే దానిని పరిగణనలోకి తీసుకోరు. కాబట్టి అలాంటి వాటిని ముందుగానే రెన్యువల్ చేయించుకోవాలి.

ప్ర: పాస్‌పోర్టు పోతే వెంటనే ఇంకోటి జారీ చేస్తారా?

జ: పాస్‌పోర్టు పోయినా, చిరిగిపోయినా దానిని సీరియస్‌గానే పరిగణిస్తారు. పాస్‌పోర్టు అనేది విలువైన డాక్యుమెంట్. చాలా జాగ్రత్తగా ఉంచుకోవాలి. ఎప్పుడైనా పోతే వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. వారు అది దొరకలేదని సర్టిఫికెట్ ఇచ్చిన తరువాత దరఖాస్తు చేస్తే అన్నీ పరిశీలించి కొత్తది జారీ చేస్తాం.

ప్ర: పాస్‌పోర్టు దరఖాస్తు విషయంలో కొత్తగా వచ్చిన నిబంధనలు ఏమైనా ఉన్నాయా?

జ: 2023 అక్టోబరు ఒకటో తేదీ తరువాత పుట్టినవారు ఎవరైనా పాస్‌పోర్టుకు దరఖాస్తు చేస్తే తప్పనిసరిగా పుట్టిన తేదీ సర్టిఫికెట్ సమర్పించాలి. అలాగే 18 ఏళ్లలోపు వారు దరఖాస్తు చేసినా ఇవ్వాల్సి ఉంటుంది. వారిలో చదువుకున్న వారు ఉంటే ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్ తీసుకుంటాం.

ప్ర: పాస్‌పోర్టులో జీవిత భాగస్వామి పేరు మార్పులు, చేర్పులు ఎలా?

జ: పాస్‌పోర్టులో భర్త లేదా భార్య పేరు చేర్పించాలన్నా, తొలగించాలన్నా పెళ్లి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఉండాలి. లేదంటే ఇద్దరూ కార్యాలయానికి వచ్చి జాయింట్ డిక్లరేషన్ ఇవ్వాలి.

ప్ర: ఎలమంచిలి, అరకులోయల్లో ఏర్పాటుచేసిన పోస్టాఫీసు పాస్‌పోర్టు కేంద్రాల పరిస్థితి ఏమిటి?

జ: ఎలమంచిలిలో రోజుకు 50 స్లాట్లు ఇస్తుంటే అవి ఫుల్ అయిపోతున్నాయి. అరకులో రోజుకు 40 ఇస్తుంటే... పెద్దగా స్పందన లేదు. అరకులో జనవరిలోనే ప్రారంభించాము. ఈ మూడు నెలల్లో 110 మాత్రమే దరఖాస్తులు వచ్చాయి.

ప్ర: బాగా డిమాండ్ ఉన్న కేంద్రాలు ఏమిటి?

జ: కాకినాడ, రాజమండ్రి కేంద్రాల్లో రోజుకు 90 స్లాట్లు చొప్పున ఇస్తున్నాము. ఆ ప్రాంతాల నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో విదేశాలకు పని కోసం వెళుతున్నారు.అందువల్ల అక్కడ డిమాండ్ ఎక్కువగా ఉంది.

తీరం.. మురికి కూపం

... 5వ పేజీ తరువాయి

తేలిగ్గా తీసుకుంటున్నారు. మరమ్మతులకు గురైనప్పుడు ప్రతిపాదనలు పెట్టి డబ్బులు తీసుకుంటున్నారని, కానీ పనులు జరగడం లేదని అంటున్నారు. తాజాగా పాండురంగాపురం వద్ద ఉన్న యూజీడీ పంప్‌హౌస్‌లోని మోటార్లు కొద్దిరోజులుగా పనిచేయకపోవడంతో వ్యర్థాలను నేరుగా సముద్రంలోకి వదిలేస్తున్నారు. సముద్రంలో డ్రెడ్జింగ్ ప్రక్రియ జరుగుతుండడంతో సందర్శకులు ఆ దృశ్యాన్ని చూసేందుకు తీరంలోకి వెళ్లి పైప్‌లైన్ మీద నిలబడుతున్నారు. అదే సమయంలో పంప్‌హౌస్ నుంచి యూజీడీ వ్యర్థాలు పైపు ద్వారా తీరంలోకి చేరుతున్నాయి. దుర్వాసనతో యూజీడీ వ్యర్థాలు సముద్ర జలాల్లో కలిసిపోతున్నాయి. దీనివల్ల తీరంలో పరిశుభ్రత దెబ్బతినడంతోపాటు సముద్ర జలాలు కలుషితమవుతున్నాయి. ఇదంతా ఇంజనీరింగ్ అధికారులు కళ్లారా చూస్తూ కూడా ఏమీపట్టనట్టు వదిలేయడంపై సందర్శకులు విమర్శిస్తున్నారు.

చంద్ర రాజేశ్వరరావుకు నివాళి

పెదగంట్యాడ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పేదల అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమించిన సీపీఐ అగ్రనేత చంద్ర రాజేశ్వరరావు ఆలోచనలను ఆచరణలోకి తీసుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీపీఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కె.సత్యనారాయణ అన్నారు. చంద్ర రాజేశ్వరరావు వర్ధంతిని బుధవారం ఇక్కడి పోతిన సన్యాసిరావు భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ రైతాంగ పోరాటంలో రాజే శ్వరరావు శక్తి యుక్తులను ప్రదర్శించిన తీరు నిరుపమానమన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు జి.ఆనంద్, అచ్యుతరావు, పి.పోలయ్య, పి.దుర్గారావు, కె.పోతయ్య, ఎ.విష్ణుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కుమారుడి కోసం పూజలు

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సింగపూర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కుమారుడు మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని కోరుతూ 86వ వార్డు పరిధి రాజీవ్‌నగర్ శివాలయం, హనుమాన్ ఆలయాల్లో జనసైనికులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు కాద శ్రీను, జి.వెంకటరావు, కె.కనకారావు, కనకరాజు, మురళీ, భాస్కరరాజు, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఘటాల ఊరేగింపు

పెదగంట్యాడ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): శ్రీపెంటమాంబ వార్షికోత్సవాల్లో భాగంగా బుధవారం నెల్లిముక్కు పంచాయతీ పరిధిలోని 14 కాలనీల్లో అమ్మవారి ఘటాలను ఊరేగించారు. వంశపారంపర్యంగా ఒకే కుటుంబం నుంచి వచ్చిన భక్తులు గొందేశి సత్యవతి, లక్ష్మిలు సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు మంగళవాయిద్యాల నడుమ ఘటాలను ఊరేగించారు. పలువురు భక్తులు ఘటాల్లో వేసిన బియ్యం, అన్నాన్ని రాత్రికి అమ్మవారికి నైవేద్యంగా పెట్టారు.

పైపు లైన్ల ఏర్పాటుతో తీరిన తాగునీటి కష్టాలు

పెదగంట్యాడ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సీతానగరం ఎస్సీ కాలనీకి, సిద్ధేశ్వరం గ్రామానికి తాగునీటి కష్టాలు తీరాయి. కొళాయిల ద్వారా పూర్తి సామర్థ్యంతో ఇంటింటికీ నీటి సరఫరా అవుతుంది. ఈ రెండు కాలనీలకు నూతనంగా అండర్ గ్రౌండ్ పైపు లైన్లను వేసి బుధవారం వీటి ద్వారా నీటిని విడుదల చేశారు. అన్ని కొళాయి కనెక్షన్ల ద్వారా నీరు సరఫరా సామర్థ్యాన్ని జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగం అధికారులు పరిశీలించారు. నాలుగు దశాబ్దాల క్రితం నిర్వాసిత కాలనీలు ఏర్పాటు దశలో ఈ రెండు ప్రాంతాలకు కొళాయి కనెక్షన్లు ఇచ్చారు. అయితే అప్పుడు వేసిన అండర్‌గ్రౌండ్ పైపు లైన్లు పాడవ్వడం, తరచూ మరమ్మతులకు గురవ్వడం, లీకేజీలతో ప్రజలకు పూర్తి స్థాయిలో నీరందక తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీంతో కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి జీవీఎంసీ అధికారులతో మాట్లాడు రూ.20 లక్షల వ్యయంలో కొత్తగా పైపు లైన్లు వేసేందుకు కృషి చేశారు. దీంతో ప్రజలకు నీటి కష్టాలు తీరాయి.

సినిమా గైడ్

● **గుడ్, బ్యాడ్, అగ్లీ :** శ్రీవెంకటేశ్వర, సంగం, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)
● **జాక్ :** జగదాంబ, శ్రీకన్య, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),
● **రాబిన్‌హుడ్ :** శ్రీ లీలామహల్, గోకుల్,
● **మ్యాడ్ :** జగదాంబ, శరత్, కన్య (గాజువాక),
● **పెళ్ళికాని ప్రసాద్ :** శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), తాతా (తగరపువలస)
● **కోర్ట్ :** జగదాంబ, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 16, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండ కాయలు 26, పచ్చిమిర్చి 28, కాకర కాయలు 34, బీరకాయలు 44, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 16, క్యాబేజి 14, క్యారెట్ 36 దొండకాయలు 22, బంగాళదుంపలు 17, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 26, అల్లం (పాతది) 44, బరబాటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్ధచిక్కుడు 62, దోసకాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 95, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 52, కీరదోస 22, క్యాప్సికమ్ 44, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 28, చిలగడదుంపలు 40, కంద 60, దేముడు చిక్కుడు 60, గోరుచిక్కుడు 36, బ్రకోలి 45, కూర పెండలం 26, నూల్‌కోల్ 32, పనస పొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడి కాయలు 50, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 55, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	435
విజయనగరం	439
శ్రీకాకుళం	439

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	98
లైవ్ ధర	118
విత్ స్కిన్	206
స్కిన్‌లెస్	216

నాడు కళకళ.. నేడు వెలవెల

- శిథిలావస్థకు చేరిన మహిళా ఉపాధి శిక్షణ కేంద్రం
- విష కీటకాలు సంచరిస్తున్నాయని స్థానికుల ఆవేదన
- భవనాన్ని కూల్చివేసి ప్రజావసరాలకు వినియోగించాలని విజ్ఞప్తి



శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా ఉన్న మహిళా ఉపాధి శిక్షణ కేంద్రం

పెదగంట్యాడ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ నిర్వాసిత కాలనీ పాత అయ్యన్నపాలెంలోని మహిళా ఉపాధి శిక్షణ కేంద్రం శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉంది. రెండున్నర దశాబ్దాల క్రితం మహిళలతో కళకళలాడిన కేంద్రం నేడు వెలవెలబోతుంది. శిక్షణ కేంద్రం ఆవరణ అంతా పిచ్చిమొక్కలు, ముళ్లపొదలతో నిండిపోయి పాములు, తేళ్ల ఇతర విషకీటకాలకు నిలయంగా మారింది. సెట్విస్, స్టీల్‌ప్లాంట్ సీఎస్సార్ సమకూర్చిన నిధులతో నిర్వాసిత కాలనీల్లోని మహిళలకు వివిధ ఉపాధి రంగాల్లో శిక్షణనిచ్చేందుకు ఈ భవనాన్ని ఏర్పాటు చేశారు. నిర్వాసిత కాలనీల ఆరంభ దశలో స్టీల్‌ప్లాంట్ భూసేకరణ విభాగం 1990లో ఈ భవనాన్ని నిర్మించింది.

దశాబ్ద కాలంపాటు ఈ కేంద్రం చాలా బాగా నడిచింది. ఇక్కడ చేతి కుట్టు, మిషన్ కుట్టు, ఎంబ్రాయిడరీ, జిగ్‌జాగ్, మంచం పట్టిడి నేత, చీరలకు రంగులు అద్దడం, పచ్చళ్లు, అప్పడాల తయారీ, వివిధ కంపెనీల ప్రొడక్ట్ ప్రమోషన్ వంటి వాటిలో 18 నుంచి 35 సంవత్సరాలలోపు మహిళలకు శిక్షణ ఇవ్వడం జరిగింది.

ఇందుకు అవసరమైన నిధులను సెట్విస్, స్టీల్‌ప్లాంట్ సమకూర్చేవి. ఆ తరువాత సెట్విస్ సంస్థ నిధులు మంజూరు చేయకపోవడంతో శిక్షణ కార్యక్రమాలు నిలిచిపోయాయి. ఉక్కు భూసేకరణ విభాగం కూడా దీని గురించి పట్టించుకోకపోవడంతో భవనానికి తాళాలు పడ్డాయి. కాలక్రమేణ భవనానికి ఉన్న ద్వారాలు, కిటికీలు పాడైపోగా, పైకప్పు బీటలు వారింది. భవన ఆవరణ అంతా పిచ్చిమొక్కలతో నిండిపోవడంతో లోపలకు వెళ్లలేని దుస్థితి నెలకొంది. విష కీటకాలకు ఇది నిలయంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి ఈ భవనాన్ని కూల్చివేసి ప్రజా ప్రయోజనార్థం ఈ స్థలాన్ని వినియోగించాలని కోరుతున్నారు.

జగన్‌పై గాజువాక పోలీసులకు ఫిర్యాదు



సీఐ పార్థసారథికి ఫిర్యాదు చేస్తున్న బీవీ రామ్

గాజువాక, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పోలీసులపై అనుచిత వాఖ్యలు చేసిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను అరెస్టు చేయాలంటూ తెలుగుశక్తి అధ్యక్షుడు బీవీ రామ్ బుధవారం గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులను కించపరిచేలా జగన్ మాట్లాడారని, ఇది పోలీసుల్లో విపరీతమైన ఒత్తిడి తీసుకువస్తుందన్నారు. రాష్ట్రంలో పోలీసులు చట్ట ప్రకారం విధులు నిర్వహించడాన్ని జగన్ ఓర్వలేకపోతున్నారని, వారిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆయనపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని రామ్ ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో పూర్ణచంద్రరావు, వెంకటేశ్వరరావు, సత్తిబాబు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం: బీజేపీ నేత 'కరణంరెడ్డి'

గాజువాక, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో బుధవారం రాత్రి జరిగిన పార్టీ క్రియాశీలక సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశం కోసం, ధర్మం కోసం పనిచేసే పార్టీ ఒక్క బీజేపీ మాత్రమేనన్నారు. ప్రతి ఒక్క ఇంటికి సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దీనంకొండ కృష్ణంరాజు మాట్లాడుతూ ప్రపంచంలోనే మన దేశానికి ప్రత్యేక గుర్తింపు ఉందని, దీనికి పీఎం మోదీ చేసిన కృషే కారణమన్నారు. సమావేశంలో నాయకులు సిరసపల్లి నూకరాజు, బొండా యల్లాజీరావు, శంకరరావు, అప్పలరాజు, తాతారావు, నాగేశ్వరరావు, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలు



అశ్వ వాహనంపై వేంకటేశ్వరస్వామి

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి రాజులపాలెంలో శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం సుప్రభాత సేవ, శ్రీలక్ష్మీనారాయణ ఇష్టి, పంచామృతాభిషేకాలు, నిత్య పూర్ణాహుతి, విష్ణుసహస్రనామ పారాయణం, తదితర పూజాది కార్యక్రమాలను చేపట్టారు. మధ్యాహ్నం అన్న సమారాధన, సాయంత్రం శ్రీవారిని అశ్వ వాహనంపై అధిష్ఠింపజేసి సాంస్కృతిక కార్యక్రమాల మధ్య ఊరేగించారు. శ్రీవారిని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్‌తో పాటు అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు యూవీ కాశీరాజు, బి.అశోక్‌కుమార్ రాజు, కృష్ణంరాజు, ఎస్.చంద్రశేఖర్, కేవీఎస్ఎన్ రాజు, వరహాలబాబు, రామచంద్రరాజా వర్మ, సుబ్బరాజు, సాయివర్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమాంబ ఆలయ వార్షికోత్సవం

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఫార్మాసిటీ పునరావాస కాలనీ కొత్తపాలెం గ్రామస్థుల ఆరాధ్య దేవత దుర్గమాంబ ఆలయ 15వ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అర్చకులు నూతన వస్త్రాలు, పుష్పాలతో అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి పూజలు చేయగా, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్న సమారాధనను చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు బొర్రమాంబ పుట్టబంగారం ఉత్సవం

ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత బొర్రమాంబ పుట్టబంగారం ఉత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు జలాభిషేకాలు చేస్తారు. వేకువజాము నుంచే అమ్మవారి దర్శనాలు ప్రారంభమవుతాయని ఉత్సవ కమిటీ చైర్మన్ చిత్తా గణేశ్ తెలిపారు. 14న అమ్మవారి తొలేళ్లు, 15న అమ్మవారి అనుపోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు.

కార్మికులకు ప్రమాద బీమా

మల్కాపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : షిప్‌యార్డు అధికారులకు, ఉద్యోగులకు, కాంట్రాక్టు కార్మికులకు గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ (జీపీఏ) పథకాన్ని ఈనెల 1వ తేదీ నుంచి అమలు చేస్తున్నట్టు షిప్‌యార్డు జనరల్ మేనేజర్ (హెచ్ఆర్) రాజేంద్రకుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. షిప్‌యార్డులో ఈ పథకం ప్రవేశపెట్టడం ఇదే తొలిసారి. అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు ఈ పథకం పొందడానికి పైసా కూడా చెల్లించనవసరం లేదు.

సింహాచలం రైల్వే స్టేషన్‌లో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు

గోపాలపట్నం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : సాగర్ కవచ్ పేరిట సింహాచలం రైల్వేస్టేషన్‌లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న మాక్‌డ్రిల్ బుధవారం నుంచి ప్రారంభమైంది. తొలిరోజు స్టేషన్ ఆవరణలో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. స్టేషన్‌కు వచ్చీ వెళ్లే ప్రయాణికుల లగేజీలను తనిఖీ చేశారు. విపత్తులు, అనివార్య సంఘటనలు జరిగే సమయంలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడానికి ఇటువంటి మాక్ డ్రిల్‌లు ఎంతో దోహదపడతాయని అధికారులు తెలిపారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెందుర్తి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : చినముషిడివాడ సబ్‌స్టేషన్ పరిధిలోని 33/11 కేవీ లక్ష్మీనగర్ ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. చాణక్యనగర్, కిశోర్ లేఅవుట్, సిద్దార్థనగర్, పీఎఫ్ కాలనీ, రిజిస్ట్రర్ ఆఫీస్, ఎస్సీ బీసీ కాలనీ, సావిత్రినగర్, చినముషిడివాడ మెయిన్ రోడ్డు ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు.

ఇళ్ల పట్టాలివ్వాలని ధర్నా

ఎన్ఏడీ జంక్షన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు బుధవారం గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా 78వ వార్డు కార్పొరేటర్ బి. రంగారావు మాట్లాడుతూ జీఓ ప్రకారం 2019కి ముందు నుంచీ ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటున్న వారికి ఇళ్ల పట్టాలివ్వాలన్నారు. అనంతరం డీటీ సువర్ణబాయికి వినతిపత్రం అందించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే పంచకర్ల



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే రమేశ్‌బాబు

పెందుర్తి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి పాలన సాగుతుందని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. బుధవారం ఆయన 97వ వార్డు పరిధిలోని పలు అభివృద్ధి పనులకు కార్పొరేటర్ సేనాపతి వసంత శంకరరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డుల్లో వంద కోట్ల రూపాయలతో చేపట్టనున్న అభివృద్ధి పనులను శంకుస్థాపనలతో సరిపెట్టకుండా ప్రారంభోత్సవాలు కూడా చేస్తామన్నారు. జీవీఎంసీలో 97 వార్డును నెంబర్ వన్‌గా నిలుపుతామని చెప్పారు. అనంతరం సుజాతనగర్‌లోని గిరిప్రసాద్‌నగర్-1, చినముషిడివాడలో భాస్కరరెడ్డి లేఅవుట్, అంబేడ్కర్‌నగర్, ద్రోణంరాజునగర్‌లో నిర్మించనున్న సీసీ రోడ్లు, కాలువల పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అవగడ్డ అప్పలనాయుడు, సేనాపతి శంకరావు, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి సింహాచలం, వార్డు అధ్యక్షుడు సేనాపతి సోమశేఖర్, పిన్నింటి వరలక్ష్మి, అయితి సింహాచలం, పిళ్లా జగన్మోహన్ పాత్రుడు, డీబీఎల్ నాయుడు, గొర్లె అప్పారావు, నాయుడు పాల్గొన్నారు.

గ్యాస్ ధర తగ్గించాలి : సీపీఐ




పెందుర్తి కూడలిలో రాస్తారోకో చేస్తున్న నాయకులు

మల్కాపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : గ్యాస్ ధర పెంపును నిరసిస్తూ సీపీఐ నాయకులు పారిశ్రామిక ప్రాంతంలో బుధవారం ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పశ్చిమ నియోజకవర్గం సీపీఐ కార్యదర్శి కాండ్రేగుల సత్యంజనేయ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లోనే నిత్యావసర సరకుల ధరలు పెరిగాయని, ఇప్పుడు కేంద్రం గ్యాస్ ధర పెంచిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గుడాల రాంబాబు, గండి అప్పారావు, నూనెల సూరిబాబు, సత్తిబాబు, ఈశ్వరరావు పాల్గొన్నారు. అలాగే నెహ్రూనగర్ జంక్షన్‌లో సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మల్కాపురం జోన్ నాయకుడు ఆర్. లక్ష్మణమూర్తి మాట్లాడుతూ కేంద్రం పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఒకవైపు పెరిగిన కరెంట్ చార్జీలతో ప్రజలు ఇబ్బంది పడుతుంటే మరోవైపు గ్యాస్ ధర పెంచి ప్రజలను మరింత ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమణ, విమల, రాంబాబు, సూరిబాబు, రాము, రాజు, పైడినాయుడు, వెంకటేష్, తది తరులు పాల్గొన్నారు.

పెందుర్తి: పెందుర్తి కూడలిలో సీపీఐ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి, కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆర్. శ్రీనివాసరావు, అసిరినాయుడు, అన్నపూర్ణ, అరుణ, శ్రీరామ్, జ్యోతి పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే చట్టాలను అధ్యయనం చేయాలి

ఏపీ హైకోర్టు న్యాయమూర్తి వీఆర్‌కే కృపాసాగర్



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి కృపాసాగర్

సబ్బవరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలోనే చట్టాలను అధ్యయనం చేయాలని న్యాయ విద్యార్థులకు ఏపీ హైకోర్టు న్యాయమూర్తి వీఆర్‌కే కృపాసాగర్ సూచించారు. స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో బుధవారం 'న్యాయ విద్య- న్యాయవాద వృత్తి' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్సు పూర్తయి బయటకు వెళితే ఎవరూ పట్టించుకోరని, కాలేజీ సమయాన్ని సద్వినియోగం చేసుకొని వర్సిటీలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. కాలానుగుణంగా వచ్చే మార్పులు, తీర్పులపై అవగాహన పెంచుకుంటే న్యాయవాద వృత్తిలో విజయవంతంగా రాణించవచ్చునన్నారు. అంతకుముందు వీసీ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు అధ్యక్షోపన్యాసం చేశారు. అనంతరం కృపాసాగర్‌ను వీసీ జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు.

రోడ్డుపై మురుగు నీటితో అవస్థలు



ప్రధాన రహదారిపై చేరిన మురుగు

మల్కాపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామిక ప్రాంతం ప్రధాన రహదారి మంగళవారం రాత్రి కురిసిన వర్షంతో బురదమయంగా మారింది. గెడ్డల్లో ఉన్న మురుగు నీరు, చెత్త రోడ్డు మీదకు రావడంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కోస్టు గార్డు ప్రధాన కార్యాలయం ఏరియా, నౌసేనాబాగ్ చిల్డ్రన్ స్కూల్, మహాలక్ష్మి థియేటర్ ఎదురుగా ఉన్న పోర్టు స్థలం, మల్కాపురం పోలీసు స్టేషన్ ఆవరణలో మురుగు నీరు ఎక్కువగా చేరింది. రోడ్డు నిర్మించినప్పుడు ఇరువైపులా కాలువలు ఏర్పాటు చేయకపోవడంతో వర్షం పడిన ప్రతిసారి ఇదే పరిస్థితి. కాగా వర్షానికి గుల్లవీధి, పల్లెవీధులు నీట మునగడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

అయ్యప్ప స్వామి జన్మ దినోత్సవాలు ప్రారంభం

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీల నిర్వహణ

అక్కిరెడ్డిపాలెం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వామి జన్మ దినోత్సవాలను మణికంఠ జ్యోతి భక్త సేవా సంఘం ఆధ్వర్యంలో షీలానగర్‌లోని ఆలయంలో బుధవారం ఘనంగా ప్రారంభించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. గురువారం వ్యాసరచన పోటీలను నిర్వహిస్తామని, ఆయా పోటీల విజేతలకు శుక్రవారం బహుమతులు అందజేస్తామని సంఘం ప్రతినిధులు నంబారు రాజు, చరపాక నాగార్జున తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు బొడ్డు చిన అప్పలస్వామి, నంబారు రమణ, ఎం.శ్రీనివాసరావు, టి.భద్రాచలం, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ అయ్యప్ప ఆలయంలో వేడుకలు రేపు

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంట్ అయ్యప్ప ఆలయంలో ఈనెల 11న స్వామివారి జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆ రోజు ఉదయం అష్ట ద్రవ్య గణపతి హోమం, నెయ్యాభిషేకం చేశాక స్వామివారిని శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరుపుతామన్నారు. మధ్యాహ్నం అన్న సమారాధనను చేపడతామని పేర్కొన్నారు.

అర్హులందరికీ రుణాలు ఇవ్వాలి

అగనంపూడి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రుణాలను అర్హులందరికీ అందజేయాలని స్థానిక కూటమి నాయకులు బుధవారం ఇక్కడి యూనియన్ బ్యాంక్ మేనేజర్ నాగరాజును కోరారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలకు ఎలాంటి రుణాలు ఇవ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సబ్సిడీ రుణాలను అందజేస్తుందన్నారు. అర్హులైన బీసీ నిరుపేదలకు రుణాలిచ్చేలా చొరవ తీసుకోవాలని కోరారు. దీనిపై బ్రాంచి మేనేజర్ సానుకూలంగా స్పందించారు. దరఖాస్తులను పరిశీలించి అర్హులకు రుణాలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు గల్లా రుద్రకుమార్, హనిత, బి.సత్యనారాయణ, పద్మ, తదితరులు ఉన్నారు.

23 మంది మందుబాబులకు జరిమానా

గాజువాక, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 23 మందికి కోర్టు రూ.2,30,000 జరిమానా విధించినట్టు గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు బుధవారం తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 24 మందిని కోర్టులో హాజరు పరచగా 23 మందికి ఒక్కొక్కరిరి రూ.10 వేల చొప్పున జరిమానా విధించిందని, ఒకరికి నాలుగు రోజుల పాటు జైలుశిక్ష విధించిందన్నారు.

కార్పొరేట్ కళాశాలలకు దీటుగా విద్యా బోధన

అగనంపూడి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ కాలేజీలకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యా బోధనకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బుధవారం ఆయన పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకరబాబు, స్థానిక నాయకులు మేడిశెట్టి విజయ్, జి.హనిత, ఎం.వెంకటరావు, ఎస్.సింహాచలం, ఎం.అప్పారావు, కె.తాతారావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

రోగులకు మెరుగైన వైద్యం : ప్రభుత్వ విప్ గణబాబు

గోపాలపట్నం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించే దిశగా కృషి చేస్తున్నామని ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి. గణబాబు అన్నారు. బుధవారం ఆయన సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న వసతులను సద్వినియోగం చేసుకుని, రోగులకు మెరుగైన సేవలందించాలని సూచించారు. సోలార్ పేనల్స్, పవర్ పేనల్స్‌ను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అనంతరం ఆస్పత్రిలో ఉన్న సమస్యలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జడ్పీ హేమలత, వైద్య బృందం, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కళా రత్న చలపతిరావుకు సన్మానం

మల్కాపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : అరవై నాలుగు కళల్లో ప్రముఖమైనది చిత్ర కళ అని, దాని పరిశోధనకు చిరునామా కళారత్న అవార్డు గ్రహీత సుంకర చలపతిరావు అని జిల్లా పౌర హక్కుల సంఘం అధ్యక్షుడు టి. శ్రీరామ్మూర్తి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉగాది పురస్కారం అందుకున్న చలపతిరావును మల్కాపురం శాఖా గ్రంథాలయంలో బుధవారం ఘనంగా సత్కరించారు. పౌర హక్కుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ చలపతిరావు రచయిత, పరిశోధకుడు, జర్నలిస్టు, సామాజిక కార్యకర్త, విమర్శకుడు అని కొనియాడారు. వైద్యురాలు పి. హేమలత మాట్లాడుతూ చలపతిరావుకు అద్భుతమైన పరిశీలన శక్తి, సృజనాత్మకత, స్నేహభావం ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి ఇపీఎస్ భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయుడు ప్రకాశరరావు, చిత్రకారుడు దార్వపూడి శ్రీనివాస్ మనోహర్, శివ, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై సమీక్ష

వేపగుంట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై ఈనెల 30న జరిగే చందనోత్సవంలో పారిశుధ్యానికి సంబంధించి ఎటువంటి లోపాలు లేకుండా ఏర్పాట్లు చేయాలని జీవీఎంసీ సీఎంహెచ్ఓ డాక్టర్ నరేశ్‌కుమార్ సూచించారు. బుధవారం ఆయన వేపగుంటలోని సామాజిక భవనంలో శానిటేషన్ అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాగునీటి సదుపాయం, టాయిలెట్స్ ఏర్పాటు, పరిసరాల పరిశుభ్రతపై అధికారులకు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జెడ్సీ హైమావతి, ఏఎంహెచ్ఓ డాక్టర్ బండారు అప్పలనాయుడు, శానిటరీ సూపర్‌వైజర్ ఎస్వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

పీఎం మోదీ ఆదర్శ నేత: మాజీ ఎమ్మెల్సీ మాధవ్

పెందుర్తి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్రమోదీ వికసిత్ భారత్ దార్శినికుడు, ఆదర్శ నేత అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ అన్నారు. ఆ పార్టీ జిల్లా కన్వీనర్, పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గొర్లె రామునాయుడు ఆధ్వర్యంలో పెందుర్తిలోని వెలమ భవన్‌లో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ నాయకత్వంలో దేశంలో ప్రజాస్వామ్యం బలపడుతుందన్నారు. ప్రతి వ్యక్తి సంక్షేమంపై శ్రద్ధ వహించి, భారత ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేశారని చెప్పారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుహాసిని ఆనంద్, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, కార్యదర్శి పట్టాభి, పరవాడ మండల అధ్యక్షుడు పిల్ల సతీశ్‌కుమార్, గొంప నరసింగరావు, చిక్కాల సతీశ్, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

కాలువ పనులు పరిశీలన

వేపగుంట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 93వ వార్డు పరిధిలోని కృష్ణానగర్‌లో జీవీఎంసీ నిధులు రూ. 19.80 లక్షలతో చేపడుతున్న డ్రైనేజీ పనులను కార్పొరేటర్ రాపర్తి కన్నా బుధవారం పరిశీలించారు. పనుల నాణ్యతా ప్రమాణాలను అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు కూటమి నాయకులు ఎర్రా నాగరాజు, మహేశ్, శ్రీను ఉన్నారు.

పేరు గొప్ప వార్డులో పత్తాలేని శానిటేషన్ కార్యాలయం

» ఖాళీ స్థలాలున్నా టెంట్లలోనే పారిశుధ్య పరికరాలు

» ఎవరికీ పట్టని మాధవధార దుస్థితి



మర్రిపాలెం ఉడా లేఅవుట్ ఖాళీ జాగాలో వేసిన శానిటరీ సామగ్రి



మాధవధార ఉడాకాలనీలో వృథాగా ఉన్న స్థలం

మాధవధార, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): విశాలమైన 51వవార్డు మాధవధారలో శానిటేషన్ కార్యాలయం లేదు. జీవీఎంసీ మాధవస్వామి కల్యాణమండపంలో ఓ గదిని వీరికి ఇచ్చారు. కల్యాణాలు, శుభకార్యాలు జరిగే చోట చెత్త ఊడ్చే పారలు, చీపుళ్లు, వ్యర్థాలు తరలించే తోపుడు బళ్లు నిల్వ చేసుకుంటున్నారు. కన్వెన్షన్‌గా ఈ వార్డుకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ లేరు. జోన్-5 జీవీఎంసీ పరిధిలో ఉన్న 24 వార్డుల్లో మూడు వార్డులకు ఇన్‌స్పెక్టర్ కొరత ఉంది. దీంతో శానిటరీ సమస్యలు పరిష్కారం శూన్యం.

ఈ వార్డు పరిధిలో ఆరు సచివాలయాలు, 45 మంది కార్మికులు ఉన్నారు. ఆరుగురు పారిశుధ్య కార్యదర్శులు ఉన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో ఆరుగురు కార్మికులు శుభ్రత విధుల్లో పనిచేస్తున్నారు. వీరికి అదనంగా మరో 6 క్లాప్ వాహనాలు ఉన్నాయి. ఇంటింటికీ వచ్చి చెత్త సేకరించేందుకు డ్రైవరు, లోడరు చొప్పున 12 మంది పని చేస్తున్నారు. అయినా శుభ్రత విషయంలో ఎప్పుడూ ఈ వార్డులో సమస్యలు ఎదురవుతున్నాయి. కార్మికులు తమ రోజువారీ పనుల్లో వినియోగించే యూనిఫారం నుంచి పరికరాలు, బళ్లు, చీపుళ్లు, శుభ్రపరిచేందుకు వాడే బ్లీచింగ్ వంటివి భద్రపరుచుకునేందుకు ఒక గది శాశ్వతంగా లేదు. కల్యాణంపై పరదాలు కట్టి తాత్కాలిక గుడారాలు (టెంట్లు) వేసుకుని సామాగ్రి పెట్టుకుంటున్నారు. భౌగోళికంగా పెద్దదైన వార్డులో ప్రతి రోజు ఉదయం 5 గంటలకు, మధ్యాహ్నం 2 గంటలకు ప్రతిసారీ తాత్కాలిక గది ఇచ్చిన జీవీఎంసీ మాధవస్వామి కల్యాణ మండపానికి వెళ్లవలసి వస్తోంది. అక్కడి నుంచి పరికరాలు తెచ్చుకుని, పనులు ముగిశాక మళ్లీ అక్కడికే వెళ్లి భద్రపరుస్తున్నారు. ఈ వార్డులోని 6 క్లాప్ వాహనాల్ని కూడా ఆర్‌అండ్‌బీ జంక్షన్‌లోని అన్న క్యాంటీన్ దగ్గర పార్కింగ్ చేసుకుంటున్నారు. దుర్గంధం వెదజల్లే చెత్త వాహనాలు అన్నం వడ్డించే క్యాంటీన్ పక్కన నిలిపివేస్తున్నారని అక్కడికి భోజనాలకు వచ్చే వారు పెదవి విరుస్తున్నారు.

హైవే రోడ్డుకు అవలి వైపు ఉన్న 52వ వార్డు మర్రిపాలెం ఉడా లేఅవుట్లో చక్కగా ఖాళీ స్థలాల్లో ఆ వార్డు కార్పొరేటరు చొరవతో, శానిటేషన్ కార్మికులకు కొంత జాగా ఇచ్చారు. చిన్న గదిని ఏర్పాటు చేసుకుని తాళం వేసుకుని వెళ్తుంటారు. వారికి వార్డు కార్యాలయం కూడా ఉంది. మాధవధార ఉడాకాలనీలో పద్మావతి పార్కు పక్కనే ఖాళీ జాగా ఉన్నా, స్థానిక నేతలు ఈ దిశగా ఆలోచన చేయడం లేదని పారిశుధ్య కార్మికులు వాపోతున్నారు. ఇటీవల కల్యాణ మండపం పక్కన ఉన్న తాత్కాలిక గుడారాన్ని కూడా టౌన్ ప్లానింగ్ విభాగం తొలగించింది. దీంతో వీరి సామాగ్రికి భద్రత లేదు. వార్డులో తమకు శాశ్వత కార్యాలయం మంజూరు చేయాలని కోరుతున్నారు.

అడ్వంచర్స్ స్పోర్ట్స్ నిర్వాహకుడు కాశీపై కేసు



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ లక్ష్మణమూర్తి

సీతంపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పోర్టు స్టేడియంలోని విశ్వనాథ్ అడ్వంచర్ స్పోర్ట్సు నిర్వాహకుల నిర్లక్ష్యంకారణంగానే రిషిత్ అనే బాలుడు నీటిలో మునిగి మృతి చెందాడని ఏసీపీ లక్ష్మణమూర్తి తెలిపారు. నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్పోర్ట్స్ క్లబ్‌లో సీసీ కెమెరాలు, లైఫ్ గార్డ్స్ లేవని తమ దర్యాప్తులో తేలిందన్నారు. సమయం దాటినా టికెట్లు విక్రయించడం, ముందు జాగ్రత్తలు తీసుకోకపోవడం వంటి ఉల్లంఘనలు బయటపడ్డాయన్నారు. ఇక ఏడేళ్ల బాలుడు రిషిత్‌కు సంబంధించి తెలుగు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామన్నారు. అయితే విచారణ అనంతరం స్పోర్ట్స్ కాంప్లెక్స్ యజమాని, నిర్వాహకుడు కాశీవిశ్వనాథ్ తగిన రక్షణ చర్యలు చేపట్టలేదని, ఆయన అజాగ్రత్త వల్ల రిషిత్ మృతిచెందినట్లు తేలిందన్నారు. దాంతో బుధవారం సెక్షన్లు మార్చి నిర్వాహకుడు కాశీవిశ్వనాథ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. యాజమాన్యంపై కోర్టులో అభియోగపత్రం (చార్జిషీట్) దాఖలు చేస్తామన్నారు.

చందనోత్సవం విజయవంతానికి కృషి చేయాలి



సింహగిరిపై ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్

» సింహగిరిపై అధికారులతో దేవదాయశాఖ కమిషనర్ సమీక్ష

సింహాచలం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వైశాఖ మాస శుక్లపక్ష తృతీయ ఈనెల 30న జరగనున్న సింహాచలం వరాహలక్ష్మీనృసింహస్వామి నిజరూప దర్శనం చందనోత్సవం నిర్వహణపై దేవదాయశాఖ రాష్ట్ర కమిషనర్ కొడూరి రామచంద్రమోహన్ బుధవారం సింహగిరిపై అధికారులతో సమీక్షించారు. ఉత్సవానికి చేస్తున్న ఏర్పాట్లు, ప్రణాళికలను కార్యనిర్వహణాధికారి కొమ్ముల సుబ్బారావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ద్వారా వివరించారు. అనంతరం క్యూల నిడివి, వెడల్పు, అత్యవసర ద్వారాలు, తాగునీటి సరఫరా, తదితర అంశాలను ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు మ్యాప్‌ల ఆధారంగా వివరించారు. అనంతరం కమిషనర్ అధికారులతో కలిసి నిర్మాణంలోని కెనాపీలు, పార్కింగ్ స్థలాలు, ఆలయంలో క్యూల ప్రవేశం, బయటకు వెళ్లే మార్గాలు, భక్తుల రాకపోకల నియంత్రణపై క్షేత్ర పరిశీలన చేశారు. కమిషనర్ వెంట కనకమహాలక్ష్మీ దేవస్థానం ఈఓ కె.శోభారాణి, జిల్లా అసిస్టెంట్ కమిషనర్ అన్నపూర్ణ, డిప్యూటీ కమిషనర్ సుజాత, సింహాచల దేవస్థానం డిప్యూటీ ఈఓ సింగం రాధ, ఏఈఓలు ఎన్.ఆనందకుమార్, రాజేంద్రకుమార్, పి.శ్రీనివాసరావు, తదితరులున్నారు.

రోడ్డుపైనే వ్యాపారంతో రాకపోకలకు ఇబ్బందులు



కంచరపాలెం రైతుబజారు వద్ద తోపుడు బళ్లతో ట్రాఫిక్ పరిస్థితి

కంచరపాలెం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం రైతు బజారు వద్ద పలువురు తోపుడు బండ్లు, చిల్లర వర్తకులు యథేచ్ఛగా రోడ్డు మీదే బళ్లు, దుకాణాలు పెట్టి వ్యాపారం చేస్తుండడంతో ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. బజారుకు వచ్చే వినియోగదారులకు అవస్థలు తప్పడం లేదు. ఇక్కడ వ్యాపారులు రోడ్డును సగం వరకు ఆక్రమిస్తున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనిపై గతంలో పలుమార్లు పత్రికల్లో కథనాలు వచ్చినప్పటికీ ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ సిబ్బంది పూర్తిస్థాయిలో దృష్టి సారించలేదని స్థానికులు, వాహనదారులు విమర్శలు గుప్పిస్తున్నారు. సమస్య షరా మామూలే అన్న చందంగా మారింది. ఇప్పటికైనా అధికారులు సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వాల్తేరు రైల్వే స్పోర్ట్సు సంఘం అధ్యక్షుడిగా డీఆర్ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం స్పోర్ట్సు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తూర్పుకోస్తా రైల్వే స్పోర్ట్సు అసోసియేషన్ వాల్తేరు డివిజన్ అధ్యక్షుడిగా డీఆర్ఎం లలిత్ బొహ్రా, ఉపాధ్యక్షులుగా ఏడీఆర్ఎంలు మనోజ్‌కుమార్ సాహూ, ఇ.శాంతారామ్‌లు నియమితులయ్యారు. కోశాధికారిగా సీనియర్ డీపీవో కబీర్ అన్సారీ, సలహాదారుగా సీనియర్ డీకామ్ (కోఆర్డినేషన్) అరుణకుమార్ మోహరాన నియమితులయ్యారు. స్పోర్ట్సు ఆఫీసర్‌గా సీనియర్ డీఎస్‌ఈ ఎం.హరినాథ్, జాయింట్ స్పోర్ట్సు ఆఫీసర్‌గా సీనియర్ డీపీఓ (జి) ఎ.అవినాష్ శర్మ నియమితులయ్యారు. అసిస్టెంట్ స్పోర్ట్సు ఆఫీసర్లుగా ఇండోర్ స్పోర్ట్సుకు డీఈఈ టీఆర్‌ఎస్ శేషు, అవుట్‌డోర్ గేమ్స్‌కు సీనియర్ పాటిల్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.ఉష నియమితులయ్యారు.

పదోన్నతుల కోసం పల్లాకు వినతి



ఎమ్మెల్యే పల్లాకు వినతిపత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

మహారాణిపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సచివాలయ వార్డు అడ్మినిస్ట్రేటివ్‌లకు జూనియర్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతి కల్పించాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.జె.గణేష్‌కుమార్ కోరారు. బుధవారం సంఘ సభ్యులు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలు విన్నవించి వినతిపత్రాన్ని అందించారు. ఇతర శాఖలకు సంబంధించిన అదనపు బాధ్యతలను తప్పించి, అధిక పని ఒత్తిడిని తగ్గించాలని కోరారు. పల్లా సానుకూలంగా స్పందిస్తూ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. సంఘం ప్రతినిధులు చింతకాయల బంగారురాజు, పి.అనిల్‌ప్రకాష్, డి.శివ, అలీమొహిద్దీన్, జి.రంగం, డి.కాన్సర్, పి.సవీన్, ఎస్.శివ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులను దూషించడం బాధాకరం: హేమంత్‌కుమార్

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పోలీసులను అసభ్య పదజాలంతో దూషించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవర్తన మార్చుకోకపోతే భవిష్యత్‌లో ఎన్నికల నుంచి బహిష్కరించాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ గవర్నర్‌ను కోరారు. ఆయన గవర్నర్‌కు లేఖ ద్వారా ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఓటమి అనంతరం జగన్మోహన్‌రెడ్డి మానసిక స్థితి సరిగ్గా లేదని, మర్యాద లేకుండా మాట్లాడుతున్నారన్నారు. పోలీస్ వ్యవస్థను, ప్రభుత్వాధికారులను చిన్నచూపు చూస్తూ అధికారంలోకి రాగానే పోలీసుల బట్టలు ఊడదీసి నిలబెడతామని వ్యాఖ్యానించడం బాధాకరమని అన్నారు. దేశముంతా నిద్రపోతుంటే గొప్ప త్యాగంతో నిరంతరం ఆందరినీ కాపాడేది పోలీసులన్నారు. అటువంటి పోలీసులకు మర్యాద ఇవ్వకుండా మాట్లాడడం చాలా దుర్మార్గమన్నారు.

సమ్మేటివ్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి: డీఈవో



బడి మానేసిన విద్యార్థికి పునఃప్రవేశం కల్పిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

కంచరపాలెం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో ప్రస్తుతం జరుగుతున్న ఆఖరి సమ్మేటివ్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించి ఫలితాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ సూచించారు. కంచరపాలెం దరి రామ్మూర్తిపంతులుపేట, కంచరపాలెం పాఠశాలలను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్పీపేట ఉన్నత పాఠశాలలో మూడు నెలల క్రితం బడి మానేసిన (డ్రాప్ అవుట్) దువ్వ వంశీకుమార్‌ను డీఈవో స్వయంగా తిరిగి చేర్పించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ గోపాలపట్నం మండల పరిధిలోని 7 ప్రభుత్వ పాఠశాలల నుంచి 9 మంది బడి మానేసిన విద్యార్థులను ఆయా పాఠశాలల్లో తిరిగి చేర్పించామన్నారు. అన్ని పాఠశాలల్లో ప్రస్తుతం జరుగుతున్న సమ్మేటివ్ పరీక్షలను ఉపాధ్యాయులు పక్కాగా నిర్వహించి, మూల్యాంకనం చేసి మార్కులను అప్‌లోడ్ చేయాలని సూచించారు. అనంతరం కంచరపాలెం పాఠశాలను సందర్శించి విద్యార్థుల పరీక్ష రాస్తున్న తీరును గమనించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ డీ.వీరాజ్, ఇన్‌ఛార్జి హెచ్ఎం ఎన్.చంద్రశేఖర్, జీవీ.జగన్నాథం, హరిహరినాథ్, శేషగిరిరావు, సెక్టోరియల్ అధికారులు శ్రీనివాసరావు, గీత పాల్గొన్నారు.

జీవనమార్గ దిక్సూచి భగవద్గీత



సమావేశంలో మాట్లాడుతున్న బి.రాధారాణి

సీతంపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): భగవద్గీతను చదవడం వలన వ్యక్తికి తన గమ్యం, శక్తి సామర్థ్యంతో పాటు పరిసర ప్రపంచంతో సంబంధ, బాంధవ్యాలు అర్థమవుతాయని విశ్లేషకురాలు బి.రాధారాణి పేర్కొన్నారు. సీతంపేట రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాలలో సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం సభ నిర్వహించారు. సంస్థ అధ్యక్షులు శేఖరమంత్రి ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి వక్తగా విచ్చేసిన బి.రాధారాణి మాట్లాడుతూ భగవద్గీత ప్రతి ఒక్కరికి జీవన మార్గాన్ని, సన్మార్గాన్ని, ధర్మబద్ధమైన జీవనవిధానమును బోధించే గురువు అన్నారు. డాక్టర్ డి.వి.సూర్యారావు సమీక్షిస్తూ నిత్య చైతన్య స్ఫూర్తి భగవద్గీత అన్నారు. ఈ కార్యక్రమంలో రచయిత కవితాస, డాక్టర్ సూరనేని విజయకుమార్, డాక్టర్ కెజీవెస్ మూర్తి, కొత్తూరు రమణ తదితరులు పాల్గొన్నారు.

మహిళా కళాశాల అభివృద్ధికి రూ.50 లక్షల విరాళం



కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న హెచ్‌పీసీఎల్ అధికారులు, చిత్రంలో ప్రిన్సిపాల్ మంజుల

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం మహిళా కళాశాల అభివృద్ధి నిమిత్తం కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద హెచ్‌పీసీఎల్ రూ.50 లక్షల విరాళం అందించింది. బుధవారం సాయంత్రం సంస్థ సీజీఎం జి.కిరణ్ కుమార్, విశాఖ రిఫైనరీ ఈడీ ఆర్.రామకృష్ణన్, సీజీఎం(ఇ) శ్రీనివాసరావులు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌ను ఆయన చాంబర్‌లో కలిసి ఈ మొత్తానికి చెక్కును అందజేశారు. కళాశాలలో మరుగుదొడ్ల వ్యవస్థ ఆధునీకరణ, ఇతర అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఉపయోగించాలని కళాశాల అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మంజుల, సీనియర్ అధ్యాపకులు పాల్గొన్నారు.

చంద్ర రాజేశ్వరరావుకు ఘన నివాళులు



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ, చిత్రంలో ఇతర నాయకులు

అల్లిపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): భారత స్వాతంత్ర్య సంగ్రామ పోరాట యోధుడు, సీపీఐ పూర్వ ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వరరావు (సీఆర్) వర్ధంతి సందర్భంగా బుధవారం అల్లిపురంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఆర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా, పార్టీ జాతీయ సమితి ప్రధాన కార్యదర్శిగా 26 సంవత్సరాలు బాధ్యతలు నిర్వహించారని, పార్టీ ప్రజా సంఘాల నిర్మాణానికి విశేష కృషిచేశారన్నారు. నిజాయితీ, నిబద్ధత గల చంద్ర రాజేశ్వరరావు ఆశయాలను నాయకులు, కార్యకర్తలు ఆదర్శంగా తీసుకొని ఆయన నిజమైన నివాళి అర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యులు ఎ.విమల, సీహెచ్.క్షేత్రపాల్, జి.కామేశ్వర్రెడ్డి, ఎస్.నాగభూషణం తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

టీడీపీ నాకు తల్లి లాంటిది

జిల్లా మహిళా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి



డాబాగార్డెన్స్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం నాకు కన్నతల్లి లాంటిదని, అటువంటి పార్టీపై ఎంతో గౌరవం ఉందని టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి అన్నారు. రాబోయే రోజుల్లో త నకు నామినేటెడ్ పోస్టు వస్తుందని ఆశిస్తూ కొంత మంది కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. బుధవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. తనకు జరిగిన అన్యాయాన్ని జిల్లా పార్టీ నేతల దృష్టికి తీసుకెళ్లానని, న్యాయం చేస్తారనే నమ్మకం ఉందన్నారు. కొత్తూరు నరేంద్రకు గతంలో తాను రూ.25 లక్షలు అప్పుగా ఇచ్చానన్నారు. డబ్బులు తిరిగి ఇవ్వాలని అనేకసార్లు అడిగానని, తీవ్రమైన అప్పుల వేదనతో ఉన్న తాను ఆవేశంలో గాజువాక పోలీస్ స్టేషన్ ఆవరణలో నరేంద్రను కొట్టిన విషయం నిజమేనన్నారు. దాని వెనుక ఎంతో బాధ దాగి ఉందన్నారు. కొత్తూరు నరేంద్ర వల్ల మోసపోయినవారితో కలిసి తాను పోలీస్‌స్టేషన్‌కు వెళ్లానన్నారు. గాజువాక సీఐ, పోలీసులు పూర్తిగా వ్యతిరేకంగా వ్యవహరించారన్నారు. పోలీసులు ఇప్పుడు ఎవరి ఒత్తిడితో తనను విచారణ చేశారో చెప్పాలన్నారు. తాను నేరం చేసినట్టు నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధమన్నారు. తాను అన్నట్టుగా వీడియో ఉంటే పబ్లిక్ ఎందుకు విడుదల చేయడం లేదని ఆమె ప్రశ్నించారు. ఇదే విషయమై కోర్టులో సైతం తనకు అనుకూలంగా వచ్చిందన్నారు. తనకు జరిగిన అన్యాయంతో పార్టీ మనస్తాపం చెందానన్నారు.

అప్పన్న కల్యాణోత్సవంలో నేటి కార్యక్రమాలు

సింహాచలం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీ నృసింహస్వామి వార్షిక తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధన, విశేష హోమాలు, బాలభోగం నివేదన, గ్రామ బలిహరణం చేస్తారు. ఉదయం 7.30 గం టలకు వైదిక సదస్యం, మంగళాశాసనం, 8.00 నుంచి 11.30 వరకు భక్తుల సర్వదర్శనాలు కల్పిస్తారు. మధ్యాహ్నం 11.30 నుంచి 12.30 గంటల వరకు రాజభోగము మహా నివేదన (దర్శనములు నిలుపుదల చేయబడు), 3.00 గంటలకు వేద పండిత సదస్యం, సాయంత్రం 6 గంటలకు సర్వజన మనోరంజని వాహనంపై గ్రామ తిరువీధి, రాత్రి 7 గంటలకు ఆరాధన, విశేష హోమాలు, (దర్శనములు నిలుపుదల), రాత్రి 10 గంటలకు నివేదన, గ్రామ బలిహరణ, మంగళ శాసనం, కవాట బంధనం చేస్తారు.

భీమిలి బీచ్ రోడ్డులో డబుల్ డెక్కర్ బస్సులు

... 5వ పేజీ తరువాయి

అవసరమైన చార్జింగ్ పాయింట్లు కేటాయించాలని రీజనల్ మేనేజర్‌కు సూచించారు. ఈ బస్సులు మాడదానికి చాలా ఆకర్షణీయంగా ఉంటాయి.

వాస్తవానికి ప్రస్తుతం బీచ్ రోడ్డులో బస్సులు ఏవీ లేవు. భీమిలి వెళ్లే ఒక బస్సు ఎంవీపీ కాలనీ మీదుగా అప్పుఘర్ చేరి, అక్కడి నుంచి రుషికొండ మీదుగా వెళుతుంది. ఇది కాలేజీ సమయంలో పూర్తిగా కిక్కిరిసి ఉంటుంది. పర్యాటకులు ఆర్‌కే బీచ్ నుంచి గానీ, ఫిషింగ్ హార్బర్ నుంచి గానీ రుషికొండ, భీమిలి వెళ్లాలంటే బస్సు సౌకర్యం లేదు. ఇప్పుడు అందమైన బస్సులు అందుబాటులోకి వస్తే బీచ్ టూరిజం పెరుగుతుందని, ముఖ్యంగా సాయంత్రం వేళల్లో డిమాండ్ బాగుంటుందని అధికారులు భావిస్తున్నారు. వీటికి ఆదరణ బాగుంటే మరిన్ని బస్సులు నడిపే ప్రయత్నం చేస్తామని అధికార వర్గాలు తెలిపాయి. ఈ బస్సులు వారం రోజుల్లో విశాఖ పట్నం వచ్చే అవకాశం ఉంది.

తీరం..మురికి కూపం

... 5వ పేజీ తరువాయి

తెలిగ్గా తీసుకుంటున్నారు. మరమ్మతులకు గుర్తినప్పుడు ప్రతిపాదనలు పెట్టి డబ్బులు తీసుకుంటున్నారు, కానీ పనులు మాత్రం జరగడం లేదని అంటున్నారు. తాజాగా పాండురంగాపురం వద్ద ఉన్న యూజీడీ పంప్‌హౌస్‌లోని మోటార్లు గత కొద్దిరోజులుగా పనిచేయకపోవడంతో వ్యర్థాలు నేరుగా సముద్రంలోకి వదిలేస్తున్నారు. సముద్రంలో డ్రెడ్జింగ్ ప్రక్రియ జరుగుతుండడంతో సందర్శకులు ఆ దృశ్యాన్ని చూసేందుకు తీరంలోకి వెళ్లే పైపులైన్ మీద నిలబడుతున్నారు. అదే సమయంలో పంప్‌హౌస్ నుంచి యూజీడీ వ్యర్థాలు పైపు ద్వారా తీరంలోకి చేరుతున్నాయి. దుర్వాసనతో యూజీడీ వ్యర్థాలు సముద్ర జలాల్లో కలిసిపోతున్నాయి. దీనివల్ల తీరంలో పరిశుభ్రత దెబ్బతినడంతోపాటు సముద్ర జలాలు కలుషితమవుతున్నాయి. ఇదంతా ఇంజనీరింగ్ అధికారులు కళ్లారా చూస్తూ కూడా పట్టనట్టు వదిలేయడంపై సందర్శకులు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు.

ఈ-పాస్‌పోర్టులు

... 5వ పేజీ తరువాయి

కావలసి వస్తుంది. అటువంటి వారు వాటికి సంబంధించిన ఆధారాలతో పాటు బుక్ చేసుకున్న విమానం టికెట్ తప్పనిసరిగా సమర్పించాలి. అలా చేస్తే వెంటనే పాస్‌పోర్టు జారీ చేస్తాం. శ్రీకాకుళం జిల్లాకు చెందిన కొందరు పిల్లలు బాక్సింగ్ పోటీలలో పాల్గొనడానికి విదేశాలకు వెళతామంటే బాక్సింగ్ అసోసియేషన్ ఆ పత్రాలతో దరఖాస్తు చేసింది. వెంటనే ఇచ్చాం.

ప్ర: విదేశీ పర్యటనకు వెళ్లేవారు పాస్‌పోర్టు విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు ఏమిటి?

జ: విదేశాలకు వెళ్లే వారి పాస్‌పోర్టుకు కనీసం ఆరు నెలల వ్యాలిడిటీ ఉండాలి. అంటే ఆరు నెలల కంటే తక్కువ సమయంలో అది ఎక్స్‌పైర్ అయిపోతుంటుందనుకుంటే దానిని పరిగణనలోకి తీసుకోరు. కాబట్టి అలాంటి వాటిని ముందుగానే రెన్యువల్ చేయించుకోవాలి.

ప్ర: పాస్‌పోర్టు పోతే వెంటనే ఇంకోటి జారీ చేస్తారా?

జ: పాస్‌పోర్టు పోయినా, చిరిగిపోయినా దానిని సీరియస్‌గానే పరిగణిస్తాం. పాస్‌పోర్టు అనేది విలువైన డాక్యుమెంట్. చాలా జాగ్రత్తగా ఉంచుకోవాలి. ఎప్పుడైనా పోతే వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. వారు అది దొరకలేదని సర్టిఫికెట్ ఇచ్చిన తరువాత దరఖాస్తు చేస్తే అన్నీ పరిశీలించి కొత్తది జారీ చేస్తాం.

ప్ర: పాస్‌పోర్టు దరఖాస్తు విషయంలో కొత్తగా వచ్చిన నిబంధనలు ఏమైనా ఉన్నాయా?

జ: 2023 అక్టోబరు ఒకటో తేదీ తరువాత పుట్టినవారు ఎవరైనా పాస్‌పోర్టుకు దరఖాస్తు చేస్తే తప్పనిసరిగా పుట్టిన తేదీ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుంది. అలాగే 18 ఏళ్లలోపు వారు దరఖాస్తు చేసినా ఇవ్వాల్సి ఉంటుంది. వారిలో చదువుకున్న వారు ఉంటే ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్‌ను పరిగణనలోకి తీసుకుంటాం.

ప్ర: పాస్‌పోర్టులో జీవిత భాగస్వామి పేరు మార్పులు, చేర్పులు ఎలా?

జ: పాస్‌పోర్టులో భర్త లేదా భార్య పేరు చేర్చించాలన్నా, తొలగించాలన్నా పెళ్లి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఉండాలి. లేదంటే ఇద్దరూ కార్యాలయానికి వచ్చి జాయింట్ డిక్లరేషన్ ఇవ్వాలి. అప్పుడే సాధ్యమవుతుంది.

ప్ర: ఎలమంచిలి, అరకులోయల్లో ఏర్పాటుచేసిన పోస్టాఫీసు పాస్‌పోర్టు కేంద్రాల పరిస్థితి ఏమిటి?

జ: ఎలమంచిలిలో రోజుకు 50 స్లాట్లు ఇస్తుంటే అవి ఫుల్ అయిపోతున్నాయి. అరకులో రోజుకు 40 ఇస్తుంటే... పెద్దగా స్పందన లేదు. అరకులో జనవరిలోనే ప్రారంభించాము. ఈ మూడు నెలల్లో 110 మాత్రమే దరఖాస్తులు వచ్చాయి.

ప్ర: బాగా డిమాండ్ ఉన్న కేంద్రాలు ఏమిటి?

జ: కాకినాడ, రాజమండ్రి కేంద్రాల్లో రోజుకు 90 స్లాట్లు చొప్పున ఇస్తున్నాము. ఆ ప్రాంతాల నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో విదేశాలకు పని కోసం వెళుతున్నారు. అందువల్ల అక్కడ డిమాండ్ ఎక్కువగా ఉంది.

లోకో పైలట్ల సమస్యలు పరిష్కరించకపోతే నిరసన దీక్షలు

» తూర్పుకోస్తారైల్వే శ్రామిక్ కాంగ్రెస్ నాయకుల హెచ్చరిక



సమావేశంలో పాల్గొన్న నాయకులు సంపత్‌కుమార్, టి.వి.పాలి తదితరులు

విశాఖపట్నం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రైల్వేలోని లోకో పైలట్ ఉద్యోగుల సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కరించకపోతే ఈ నెల 18 నుంచి నిరాహార దీక్షలు చేపడతామని తూర్పుకోస్తారైల్వే శ్రామిక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జె.సంపత్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ టి.నర్సింగరావు, వాల్తేరు డివిజన్ కోఆర్డినేటర్ టి.వి.మాలేశ్వరరావులు హెచ్చరించారు. బుధవారం యూనియన్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్ (ఎన్ఎఫ్ఐఆర్) నాయకులు బుధవారం ఢిల్లీలోని రైల్వే బోర్డు చైర్మన్‌కు వినతిపత్రం సమర్పించారని తెలిపారు. రన్నింగ్ సిబ్బంది ఆరో వేతన సంఘం సిఫార్సుల ప్రకారం ప్రస్తుతం కిలోమీటర్ అలవెన్సు పెంచాలని, రైల్వే బోర్డు నిబంధనల ప్రకారం మినిమం గ్యారంటీ కిలోమీటర్లు (120కి.మీ) పద్ధతిని వర్తింప చేయాలని, రన్నింగ్ సిబ్బందికి కిలోమీటర్ అలవెన్సు పెంచాలని, రైల్వే బోర్డు మార్గదర్శకాల మేరకు తొమ్మిది గంటల పనివేళలు అమలు చేయాలని, అలాగే ఒత్తిడిని తగ్గించేందుకు రెస్ట్ రూమ్స్, క్వార్టర్లలో వసతులు ఆధునీకరించాలని డిమాండ్ చేశారు. వరుసగా నాలుగు రాత్రుల తర్వాత సిబ్బందిని తిరిగి డ్యూటీకి బుక్ చేయడం రైల్వే బోర్డు మార్గదర్శకాలకు విరుద్ధమని పేర్కొంటూ పలు సమస్యలను వినతిపత్రం ద్వారా తెలియజేశారు. సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా రైల్వే యాజమాన్యం చర్యలు తీసుకోకుంటే ఎన్ఎఫ్ఐఆర్ పిలుపు మేరకు ఈ నెల 18 నుంచి నిరాహార దీక్షలు చేపడతామన్నారు. ఈ ఉద్యమంలో ఉద్యోగులు భాగస్వాములై సమస్యలను పరిష్కారం లభించేవరకు ఉమ్మడి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తూర్పుకోస్తారైల్వే శ్రామిక్ కాంగ్రెస్ వాల్తేరు డివిజన్ శాఖ నాయకులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో మోగని వాటర్‌బెల్

- మూడు వాటర్ బెల్స్ మోగించాలన్న ఆదేశాలు బేఖార్
- ఒక బ్రేక్‌తో సరిపెడుతున్న విద్యాసంస్థలు
- అవగాహన బ్యానర్లు శూన్యం
- అధికారుల పర్యవేక్షణ లోపం


రేసపువానిపాలెంలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో వాటర్ బెల్ సమయంలో ఖాళీగా ఉన్న నీరు తాగే ప్రాంతం

మద్దిలపాలెం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అధిక ఉష్ణోగ్రతల కారణంగా విద్యార్థులు డీహైడ్రేషన్, అలసట, వడదెబ్బలకు గురికాకుండా రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది వాటర్‌బెల్ కార్యక్రమాన్ని అమలు చేసింది. జూనియర్ కళాశాలలు, పాఠశాలల్లో క్లాసుల మధ్య మూడు నీటి గంటలు మోగించి విద్యార్థులను అప్రమత్తం చేసి నీరు తాగించడం దీని ఉద్దేశం. మంచినీరు తాగడంపై అవగాహన కల్పిస్తూ బ్యానర్లు ఏర్పాట్లు చేయాలి.

వాటర్‌బెల్ కార్యక్రమం పక్కాగా అమలు జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశాలిచ్చింది. అయితే జిల్లాలో వాటర్‌బెల్స్ మూగబోయాయి. జూనియర్ కళాశాలలు, పాఠశాలల్లో వాటర్ బెల్ మోగడమే లేదు. రోజుకు మూడు సార్లు అంటే ఉదయం 8.45, 10.05, 11.50 గంటలకు వాటర్ బెల్ మోగించి విద్యార్థులకు నీరు తాగడానికి విరామం ఇవ్వాల్సివుండగా ఒక బ్రేక్‌తో సరిపెడుతున్నారు. విచారకర విషయం ఏమిటంటే.. చాలా విద్యాసంస్థల్లో తాగు నీటి సదుపాయయే లేదు. డోనర్లు అందించిన వాటర్‌ప్లాంట్‌ల ద్వారా కొన్ని విద్యాలయాల్లో తాగునీరు అందుబాటులో ఉంది. మిగతా కళాశాలలు, పాఠశాలల్లో రూ.20 విలువైన ఒకటి, రెండు వాటర్ క్యాన్‌లే గతి. అవి ఖాళీ అయితే నీరు కూడా ఉండని పరిస్థితి. దీంతో చాలామంది విద్యార్థులు ఇంటి నుంచే వాటర్ బాటిళ్ల ద్వారా నీటిని పట్టుకుని వెళ్తున్నారు.

పర్యవేక్షణ లోపం..

జిల్లాలో వాటర్ బెల్ కార్యక్రమంపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. విద్యాసంస్థల్లో నీటి సదుపాయాల గురించి ఇప్పటి వరకూ ఆరాతీసిన దాఖల్లేవు. పాఠశాలల్లో ఈ కార్యక్రమం అమలుపై విద్యాశాఖాధికారులు తనిఖీలు చేయాల్సి ఉంది. మండల విద్యాశాఖాధికారులు, క్లస్టర్ రీసోర్స్ పర్సన్స్ పాఠశాలలు, ఇంటర్ బోర్డు అధికారులు జూనియర్ కళాశాలల్లో తనిఖీలు చేపట్టాల్సి వుండగా, ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఫలితంగా వాటర్‌బెల్ కార్యక్రమం సక్రమంగా అమలు కావడం లేదు. వాటర్‌బెల్ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తూ ఏర్పాటు చేయాల్సిన బ్యానర్లు సైతం విద్యాసంస్థల్లో కనిపించడం లేదు. విద్యార్థుల ఆరోగ్యమే ప్రథమ ప్రాధాన్యంగా చేపట్టిన వాటర్‌బెల్ కార్యక్రమం సక్రమంగా అమలయ్యేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

రేపు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఆరిలోవ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : విమ్స్ సబ్‌స్టేషన్ పరిధిలో గల పలు ప్రాంతాల్లో ఈ నెల 11న (శుక్రవారం) ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్-3 ఈఈ (ఆపరేషన్స్) పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ కైలాసగిరి ఫీడర్ నిర్వాహణ, చెట్ల కొమ్మలు నరికివేత కార్యక్రమాలు చేపడుతుండడంతో సరఫరా నిలిపి వేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తోటగరువు, బీఎస్‌ఆర్ నగర్, హనుమంతవాక జంక్షన్, విశాలాక్షి నగర్, రెవెన్యూ కాలనీ, కైలాసగిరి రోడ్డులో విద్యుత్ సరవరా నిలిపి వేస్తున్నట్టు ఈఈ తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో బీసీ సమరభేరి నిరసన రేపు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఈ నెల 11న విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ గాంధీ బొమ్మ వద్ద బీసీ సమరభేరీ నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్టు బీఎస్పీ విశాఖ జిల్లా అధ్యక్షుడు బీమరశెట్టి విశ్వనాధం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పార్టీ రాష్ట్ర కో-ఆర్డినేటర్, మాజీ డీజీపీ జె.పూర్ణచంద్రరావు, రాష్ట్ర కోశాధికారి పెదపెంకి శివప్రసాద్ పాల్గొననున్నట్టు తెలిపారు. బీసీ సమీక్షిత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో విశాఖ జిల్లా బీఎస్పీ కార్యకర్తలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

హోంమంత్రిగా అనిత విఫలం

- ఎమ్మెల్సీ వరుదు కల్యాణి విమర్శ


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వరుదు కల్యాణి

మద్దిలపాలెం, ఏప్రిల్ 9 (ఆంధ్ర జ్యోతి) : రాష్ట్ర హోంశాఖ మంత్రిగా వంగలపూడి అనిత విఫలమయ్యారని వైసీపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి విమర్శించారు. మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆరోపించారు. మహిళలపై అఘాయిత్యాలు, దాడులు, ప్రతీకార హత్యలు జరుగుతుంటే హోంమంత్రి రాజకీయ విమర్శలతో కాలం గడుపుతున్నారని మండిపడ్డారు. పోలీస్ వ్యవస్థను తెలుగుదేశం పార్టీ రాజకీయ సంస్థగా దిగజార్చిందని ఆరోపించారు. అనిత రాష్ట్రంలో శాంతి భద్రతలు పక్కనపెట్టి మాజీ సీఎం జగన్‌ను విమర్శించడానికే పరిమితమయ్యారని విమర్శించారు. జగన్‌ను కేవలం పులివెందుల ఎమ్మెల్యే అంటూ కించపరుస్తున్న అనిత, ఆయన మాజీ ముఖ్యమంత్రినే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు.

సినిమా గైడ్

- **గుడ్, బ్యాడ్, అగ్లీ :** శ్రీవెంకటేశ్వర, సంగం, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)
- **జాక్ :** జగదాంబ, శ్రీకన్య, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),
- **రాబిన్‌హుడ్ :** శ్రీ లీలామహల్, గోకుల్,
- **మ్యాడ్ :** జగదాంబ, శరత్, కన్య (గాజువాక),
- **పెళ్ళికాని ప్రసాద్ :** శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య(గోపాలపట్నం), తాతా(తగరపువలస)
- **కోర్ట్ :** జగదాంబ, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 16, వంకాయలు (తెలుపు) 22,వంకాయలు(నలుపు) 22, బెండకాయలు 26, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 34, బీరకాయలు 44, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 16, క్యాబేజి 14, క్యారెట్ 36 దొండకాయలు 22, బంగాళదుంపలు 17, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 26, అల్లం (పాతది)44, బరబాటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 62, దోస కాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 95, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 52, కీరదోస 22, కాప్సికమ్ 44, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 28 చిలగడదుంపలు 40, కంద 60, దేముడుచిక్కుడు 60, గోరుచిక్కుడు 36, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు(కిలో)45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 50, బూడిద గుమ్మడి కాయ 30, కర్రపెండలం 18, మా మిడి అల్లం55, బొప్పాయి42,జామ (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	435
విజయనగరం	439
శ్రీకాకుళం	439

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	98
లైవ్ ధర	118
విత్ స్కిన్	206
స్కిన్‌లెస్	216

అగ్ని ప్రమాద బాధితులకు సహాయం

మద్దిలపాలెం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డు శివాజీపాలెంలో అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు టీడీపీ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు, నగదు సహాయం అందించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ శివాజీపాలెంలో ఎం.శారద నివాసముంటున్న పూరిల్లు అగ్ని ప్రమాదానికి గురై వస్తువులు, నగదు కాలి బూడిదయ్యాయి. నిరాశ్రయురాలైన ఆమెకు రెండు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులు, నగదు అందించామన్నారు. ప్రభుత్వపరంగా పరిహారం అందేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు దువ్వి స్వామి, ఒమ్మి అప్పారావు, కె.ఆనంద్, డొక్కర శ్రీను,పి.డేవిడ్ పాల్గొన్నారు

'ఉపాధి' రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణబాబు

ఆరిలోవ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం వెనుకబడిని వార్గాలకు వారికి అందిస్తున్న 'ఉపాధి' రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. ఆయన బుధవారం ఆరిలోవ 13వ వార్డులో ఆఖరి బస్టాప్ వద్ద గల జీవీఎంసీ కల్యాణ మండపంలో నిర్వహించిన బీసీ కార్పొరేషన్ రుణ మేళా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం ఉపాధి కోసం రుణాలు పొందిన వారు బాధ్యతాయుతంగా రుణాలను తీర్చాలని, వ్యాపారాలు అభివృద్ధి చేసుకొని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సూచించారు. మహిళలు అంతా కుట్టు మిషన్ శిక్షణలో పాల్గొని నైపుణ్యం నేర్చుకోవాలన్నారు. శిక్షణ అనంతరం వారందరికీ ఉచితంగా కుట్టుమిషన్లు అందించడం జరుగుతుందన్నారు.

కాగా, ఈ రుణ మేళాకు 9, 10, 11, 12, 13 వార్డుల నుంచి 1200 దరఖాస్తులు వచ్చాయి. సుమారు 900 మంది ఈ ఇంటర్వ్యూకి వచ్చారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ జోన్-1 కమిషనర్ కనక మహాలక్ష్మి, టీడీపీవో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత, 10 వ వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీరాజశేఖర్, టీడీపీ 13వ వార్డు అధ్యక్షుడు పాత్రకుండ ధర్మారావు, టీడీపీ 12వ వార్డు అధ్యక్షుడు గాడి సత్యం, 11 వవార్డు అధ్యక్షుడు రాజారావు, టీడీపీ 9వ వార్డు ఇన్‌చార్జి బుడుమూరు గోవింద్, టీడీపీ పారమెంటరీ కార్యదర్శులు ఏడువాక సన్యాసిరావు, ఒమ్మి పోలారావు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లకు పట్టాలు మంజూరు చేయాలి

- జీవో నెంబరు 30 అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆందోళన



చినగదిలి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఆరిలోవ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ ప్రాంతంలో లక్షలాది మంది పేద, మధ్య తరగతి ప్రజలకు 2015, 2017 సంవత్సరంలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 296, 388 జీవోల ప్రకారం ఇచ్చిన పట్టాలను రిజిస్ట్రేషన్ చేయాలని, జీవో 30 ప్రకారం పేదల ఇళ్లకు పట్టాలు మంజూరు చేయాలని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయడు రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మద్దిలపాలెంజోన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం విశాఖ రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా ప్రభుత్వ భూములు, కొండవాలు ప్రాంతాలు, మురికివాడ ప్రాంతాల్లో రేకులషెడ్డులు, శ్లాబులు వేసుకొని జీవిస్తున్న వారికి ప్రభుత్వం రిజిస్ట్రేషన్‌తో కూడిన పట్టాలు మంజూరుచేయాలని డిమాండ్ చేశారు. వివాదాస్పద స్థలాల్లో ఉన్న వారికి ప్రభుత్వమే పరిష్కారం చూపి పట్టాలు మంజూరు చేయాలన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలు తలదాచుకోవడానికి ప్రభుత్వం సొంత ఇంటి కలను ఎలాగూ నెరవేర్చలేక పోతున్నదని, కనీసం పేదలు వేసుకున్న స్థలాకు పట్టా ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. నేడు ప్రభుత్వం ఇల్లు పట్టాలు ఇస్తున్నామంటూఆర్భాటంగా ప్రచారం చేస్తూ జీవోలు మాత్రమే జారీ చేస్తున్నదని, కానీ అమలు చేయడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2015, ఆగస్టులో జీవో నెంబరు 296 ప్రకారం కొంత మందికి పట్టాలు జారీ చేయగా, మరికొందరికి 2017, సెప్టెంబరులో 100 గజాలు లోపు వారికి ఉచిత పట్టా, 100 చదరపు గజాలు దాటిన వారికి మార్కెట్ వాల్యూ ప్రకారం పట్టాలు మంజూరు చేస్తామని చెప్పి కొద్దిమందికి మాత్రమే పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్కేఎస్వీ కుమార్ మాట్లాడుతూ పేదలు, బలహీన వర్గాల ప్రజలకు ఆటంకాలు తొలగించి ఇంటి యజమానికి శాశ్వత పట్టా మంజూరు చేయాలని కోరారు. లేనిపక్షంలో మండలంలోని అన్ని కాలనీల నుంచి ప్రజలను కదిలించి పెద్ద ఎత్తున ఉద్య మంచేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు, జోన్ కమిటీ సభ్యులు డి.అప్పలరాజు, వి.నరేంద్రకుమార్, బి.భారతి, డి.కొండమ్మ, డి.నాగరాజు, పి.శంకరరావు, పి.వెంకటరావు, కె.కుమారి, కాంత, సుజాత, మణి పాల్గొన్నారు.

'ఇగ్నో' ఆధ్వర్యంలో చిన్నారులకు చిత్రలేఖన పోటీలు


చిత్రలేఖన పోటీలో పాల్గొన్న చిన్నారులు

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 135వ జయంతి నేపథ్యంలో ఇందిరా గాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో లాసన్స్ బే కాలనీలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులకు బుధవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అరవై మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు ఈ నెల 14న ఇగ్నో ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహించే అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో బహుమతులు అందచేస్తామని ఇగ్నో సీనియర్ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. ఉప సంచాలకులు డాక్టర్ ఇ.కృష్ణారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి.సుధా కిరణ్ పాల్గొన్నారు.

సినీ దర్శకుడు రామ్‌జగదీశ్‌కు సన్మానం


'కోర్టు' చిత్ర దర్శకుడు రామ్‌జగదీష్‌ను సన్మానిస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్

సిరిపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : సందేశాత్మక చిత్రాల ద్వారా సమాజాన్ని చైతన్యపరచాలని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ అన్నారు. 'కోర్టు' చిత్ర దర్శకుడు రామ్‌జగదీష్ వీఎంఆర్డీఏ చైర్మన్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దర్శకుడిని ఎమ్మెల్యే సత్కరించి అభినందనలు తెలియజేశారు. 'కోర్టు' వంటి సందేశాత్మక చిత్రం తీయడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం మంచి కథ, కథనం ఉన్న చిత్రాలకు ఆదరణ లభిస్తోందని అన్నారు. వినోదంతో పాటు సందేశాన్ని అందించాలని సూచించారు.

తీర ప్రాంతాల్లో సాగర్ కవచ్

- భద్రతా అంశాలపై మత్స్యకారులకు అవగాహన కల్పించిన పోలీసులు


సాగర్‌కవచ్‌లో భాగంగా తీర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఐజీ గోపినాథ్ శెట్టి

సాగర్‌నగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : సాగరతీర ప్రాంతాల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న సాగర్ కవచ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం భీమిలి బీచ్, సింగమారిపేట బీచ్, రుషికొండ, సాగర్‌నగర్ బీచ్‌లలో తీర ప్రాంతాల అప్రమత్తతపై పలు విషయాలను మత్స్యకారులు, పర్యాటకులకు పలు విషయాలను వివరించారు. ఈ సందర్భంగా రుషికొండలో ఎస్‌ఐ పి.మనోజ్‌కుమార్ మత్స్యకారులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. తీర ప్రాంతాల వెంబడి ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. తీర ప్రాంతాల్లో ఎలా అప్రమత్తంగా ఉండాలి? గూఢచారి వ్యవస్థలను ఎలా కనుగొనాలి? వంటి పలు విషయాలపై అవగాహన కల్పించారు.

రుషికొండ బీచ్‌లో పర్యటించిన డీఐజీ

సాగర్ కవచ్‌లో భాగంగా రుషికొండ బీచ్‌లో బుధవారం రాత్రి మెరైన్ డీఐజీ గోపినాథ్ జెట్టీ పర్యటించారు. ఇక్కడ బీచ్‌లో ఉన్న పర్యాటకులతో కాసేపు మాట్లాడి, మత్స్యకారులతో సమావేశమయ్యారు. రెండు రోజుల పాటు సాగర కవచ్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా అన్ని ప్రాంతాల్లో ఈ కార్యక్రమం ఎలా జరుగుతుందో అనే విషయమై ఆరా తీశారు. కార్యక్రమంలో మెరైన్ సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐలు మురళీకృష్ణ, మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ మహిళా కళాశాల అభివృద్ధికి హెచ్‌సీపీఎల్ రూ.50 లక్షల విరాళం


కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు రూ.50 లక్షల విరాళం అందజేస్తున్న హెచ్‌పీసీఎల్ అధికారులు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం మహిళా కళాశాల అభివృద్ధి నిమిత్తం కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద హెచ్‌పీసీఎల్ రూ.50 లక్షల విరాళం అందించింది. బుధవారం సాయంత్రం సంస్థ సీజీఎం జి.కిరణ్‌కుమార్, విశాఖ రిఫైనరీ ఈడీ ఆర్.రామకృష్ణన్, సీపీజెడ్‌ఓ శ్రీనివాసరావులు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌ను ఆయన ఛాంబర్‌లో కలిసి ఈ మొత్తానికి చెక్కును అందజేశారు. కళాశాలలో మరుగుదొడ్ల వ్యవస్థ ఆధునీకీకరణ, ఇతర అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఉపయోగించాలని కళాశాల అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మంజుల, సీపీఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మా సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామ్ రాజుకు పాన్‌షాప్ అసోసియేషన్ సభ్యుల వినతి


పరశురామ్‌రాజుకు వినతిపత్రం అందజేస్తున్న నగర పాన్‌షాప్ అసోసియేషన్ సభ్యులు

పెదవాల్తేరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ పాన్‌షాప్ యజమానులు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్ఎన్ పరశురామ్ రాజును కోరారు. బుధవారం బీజేపీ నగర కార్యాలయలో పరశురామ్ రాజును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ జిల్లా నుంచి విశాఖ నగరానికి వలస వచ్చి సుమారు 20 ఏళ్ల నుంచి నగరంలోని వివిధ ప్రాంతాలు పాన్‌షాప్‌లు, కిరాణా షాపులు నడుపుకొంటూ వ్యాపారాలను చేసుకుంటున్నామన్నారు. అయితే, కొద్ది రోజల నుంచి పోలీసు శాఖ వారు వచ్చి ఏదో కొత్త రూల్ వచ్చిందని చెప్పి తమను, తమ కస్టమర్లను బెదిరిస్తూ కేసులు రాస్తూ తమ షాపులో ఉన్న స్టాకులు కూడా తీసుకువెళ్తూ బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్య నుంచి తమను రక్షించాలని కోరుతూ వినత పత్రం అందజేశామన్నారు. ఈ విషయమై పరశురామ్ రాజు స్పందిస్తూ పోలీసు కమిషనర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామి ఇచ్చారని దుకాణదారులు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ సహాయం అందజేత


బాధిత కుటుంబానికి సహాయ మంజూరు పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 15వ వార్డు కొత్త వెంకోజీపాలేనికి చెందిన కెటిచెర్లపాటి స్వాతి కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.3,56,377లకు సంబంధించిన పత్రాన్ని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు బుధవారం అందించారు. కొద్ది రోజుల క్రితం స్వాతి భర్త రాజేష్ మృతి చెందారు. ఎమ్మెల్యే వినతి మేరకు ఆ కుటుంబానికి ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థిక సాయం మంజూరైంది. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు బోర ధనరెడ్డి, కాళ్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం కుమారుడు కోలుకోవాలని పూజలు


ఆంజనేయ స్వామి ఆలయం ముందు కొబ్బరికాయలు కొడుతున్న కార్పొరేటర్ మూర్తి యాదవ్, జనసేన నేతలు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిన్న కుమారుడు కొణిదల మార్క్ శంకర్ పవనోవిచ్ త్వరగా కోలోకోవాలని కోరుకుంటూ సకల దేవతా ఆశీస్సులు పవన్‌కల్యాణ్, లేజినోవా దంపతులకు ఉండాలని ఆకాంక్షిస్తూ జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆధ్వర్యంలో కార్పొరేటర్లు, కార్యకర్తలు, అభిమానులు బుధవారం పూజలు నిర్వహించారు. కొత్త వెంకోజీపాలెంలోని ఆంజనేయ ఆలయంలో తొలుత పూజలు నిర్వహించి, అనంతరం 500 కొబ్బరికాయలు కొట్టారు. సింగపూర్‌లోని వేసవి శిబిరంలో గాయపడిన పవనోవిచ్ గాయాలు నుంచి కోలుకోవాలని నాయకులు ప్రార్థించారు. కార్యక్రమంలో జనసేన పర్యావరణ రాష్ట్ర విభాగ ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్య, కార్పొరేటర్ కందుల నాగరాజు, పంచకర్ల సందీప్, సంకు వెంటేశ్వరరావు, నాగలక్ష్మి, పోతు వెంకట ప్రసాద్, కళ, శ్రీనివాస్ పట్నాయక్, శేఖరి శ్రీనివాస్, శేఖర్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణలో రెల్లి సామాజిక వర్గానికి తీవ్ర అన్యాయం

- రిజర్వేషన్ శాతాన్ని ఐదుకు పెంచాలి
- జైగౌతం బాబా సంఘం కన్వీనర్ ఎస్.కల్యాణ ముని


ఆందోళన నిర్వహిస్తున్న రెల్లి సంఘాల నేతలు, కార్యకర్తలు

సిరిపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణలో రెల్లి సామాజిక వర్గానికి తీవ్ర అన్యాయం జరిగిందని జైగౌతం బాబా సంఘం కన్వీనర్ ఎస్.కల్యాణముని ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏపీ రెల్లి అభివృద్ధి సంఘం, ఇతర రెల్లి సంఘాలతో కలిసి జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కల్యాణముని మాట్లాడుతూ రెల్లి గ్రూపు కులాలకు 2 నుంచి 5 శాతం వరకు రిజర్వేషన్ కల్పించాలని నినాదాలు చేశారు. రెల్లి, ఉపకులాలు ఎప్పుడూ అన్యాయానికి గురవుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 10 లక్షల జనాభా ఉన్న తమకు వర్గీకరణలో ఒక శాతం రిజర్వేషన్ ఇవ్వడం అన్యాయమని మండిపడ్డారు. ప్రభుత్వానికి తప్పుడు సమాచారమిచ్చి తమకు అన్యాయం చేస్తున్నారన్నారు. సంఘం నేతలు వడ్డాది ప్రకాష్, వడ్డాది గోవిందరాజు మాట్లాడుతూ వర్గీకరణలో తమకు జరిగిన అన్యాయంతో తాము, తమ భావితరాలు తీవ్రంగా నష్టపోతామన్నారు. ప్రభుత్వం స్పందించి రెల్లి గ్రూపు కులాలకు రిజర్వేషన్ పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రెల్లి కార్పొరేషన్ మాజీ చైర్మన్ మధుసూదనరావు, ఉపాధ్యక్షులు వెంకటరావు, చెన్నా పాల్, మోహన్‌కుమార్, రంజిత్‌కుమార్, రంజిత తదితరులు పాల్గొన్నారు.

23 మంది మందుబాబులకు జరిమానా

గాజువాక, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 23 మందికి కోర్టు రూ.2,30,000 జరిమానా విధించినట్టు గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు బుధవారం తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 24 మందిని కోర్టులో హాజరు పరచగా 23 మందికి ఒక్కొక్కరిరి రూ.10 వేల చొప్పున జరిమానా విధించిందని, ఒకరికి నాలుగు రోజుల పాటు జైలుశిక్ష విధించిందన్నారు.

నూకాంబికను దర్శించుకున్న సీఎంఆర్ అధినేత



అమ్మవారిని దర్శించుకుంటున్న మావూరి వెంకటరమణ దంపతులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక అమ్మవారిని బుధవారం సాయంత్రం సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ దంపతులు దర్శించుకున్నారు. వారికి ఉత్సవ కమిటీ ఛైర్మన్ పీలా నాగశ్రీను స్వాగతం పలికి బాలాలయంలోని అమ్మవారికి పూజలు చేయించారు. అనంతరం ఘనంగా సత్కరించి నూకాంబిక చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

19 నుంచి క్రికెట్ వేసవి శిక్షణ శిబిరం ఎంపికలు

విశాఖపట్నం స్పోర్ట్స్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ సంఘం నిర్వహించే వార్షిక క్రికెట్ వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో పాల్గొనేందుకు క్రీడాకారుల ఎంపికలు ఈ నెల 19 నుంచి పీఎంపాలెంలోని వీడీసీఏ-బి గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్టు వీడీసీఏ కార్యదర్శి కె.పార్థసారథి తెలిపారు. బాలుర అండర్-10 విభాగానికి ఈ నెల 19, 20, అండర్-12 విభాగానికి 21, 22, అండర్-14 విభాగానికి 23, 24, అండర్-16 విభాగానికి 25, 26 తేదీల్లో ఎంపికలు జరుగుతాయన్నారు. అండర్-10 కేటగిరీ చిన్నారులు సెప్టెంబరు 1, 2015న లేదా ఆ తర్వాత, అండర్-12 చిన్నారులు సెప్టెంబరు 1, 2013న లేదా ఆ తర్వాత, అండర్-14 క్రీడాకారులు సెప్టెంబరు 1,2011న లేదా ఆ తర్వాత, అండర్-16 క్రికెటర్లు సెప్టెంబరు 1, 2009న లేదా ఆ తర్వాత పుట్టినవారై ఉండాలని స్పష్టం చేశారు. ఆసక్తి గలవారు ఈ నెల 10 నుంచి ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటలోపు వయసు ధ్రువీకరణ పత్రంతో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఎంపికలో పాల్గొనేవారు ఉదయం 8 గంటలకు వీడీసీఏ-బీ గ్రౌండ్‌లో హాజరుకావాలన్నారు.

స్వయం ప్రతిపత్తి ఉంటే ఉపాధికి ఊతం

ఒకప్పుడు నిరుద్యోగులతో కిటకిట

- ఉద్యోగాలు రాక నేడు వెలవెల
- కంచరపాలెంలోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో పనిలేని అధికారులు



కంచరపాలెంలోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం

కంచరపాలెం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి):

జిల్లా ఉపాధి కార్యాలయం ప్రాభవం కోల్పోతోంది. గతంలో వివిధ శాఖల్లో ఉద్యోగాల ఎంపికకు అభ్యర్థులకు ఉపాధి కార్యాలయంలో నమోదు తప్పనిసరి కావడంతో నిత్యం కళకళలాడుతుండేది. అయితే మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో అంతా ఆన్‌లైన్‌లోనే జరుగుతుండడంతో ఇక్కడి సిబ్బందికి పనిలేకుండా పోయింది. అంతేకాకుండా వివిధ పరిశ్రమలు, కంపెనీలు నేరుగా కళాశాలల్లోనే క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తుండడంతో ఉపాధి కార్యాలయం ఊసే విద్యార్థులు మరిచిపోయారు. ఈ నేపథ్యంలో అడపాదడపా ఉపాధి శిబిరాలను ఏర్పాటు చేయడం మినహా పనిలేకుండా పోతోంది.

ఒకప్పుడు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం (ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజి) నుంచి కాల్ లెటర్ వచ్చిందంటే దాదాపు ఉద్యోగం వచ్చినట్టేనని నిరుద్యోగులు భావించేవారు. గతంలో ఏ నియామకాలైనా జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ద్వారానే జరిగేవి. పది, ఇంటర్, డిగ్రీతో పాటు ఐటీఐ, డిప్లొమా తదితర వృత్తివిద్య కోర్సులు పూర్తిచేసిన వారు నిత్యం జిల్లా ఉపాధి కల్పన కార్యాలయాల చుట్టు కాళ్లరిగేలా తిరుగుతూ తమ విద్యార్హతలను నమోదు చేయించుకునేవారు. పోలీస్. ఆర్టీసీ, విద్య, వైద్యం, పోస్టల్, రైల్వే తదితర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఉపాధి కార్యాలయాల నుంచి కాల్ లెటర్లు వచ్చేవి. క్రమేణా శాఖలవారీగా ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి జిల్లాలో గల ఉపాధి కార్యాలయాలకు నిరుద్యోగులు ముఖం చాటేయడంతో వెలవెలబోతున్నాయి. విద్యార్హతలను నమోదు చేసుకోవడానికి నిరుద్యోగుల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన లేక అధికారులు గోళ్లుగిల్లుకుంటున్నారు. వెరసి కంచరపాలెం బాలికల ఐటీఐ ప్రాంగణంలో గల జిల్లా ఉపాధి కార్యాలయం నిత్యం వెలవెలబోతూ దర్శనమిస్తుంది.

రెండు దశాబ్దాల క్రితం ఏర్పాటు

కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ బాలికల ఐటీఐ ప్రాంగణంలో సుమారు రెండు దశాబ్దాల క్రితం ప్రభుత్వం జిల్లా ఉపాధి కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. ఈ కార్యాలయానికి సొంత భవనం లేక బాలికల ఐటీఐ భవనాల్లో అప్పట్లో తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. అయితే ఉపాధి కార్యాలయాలకు పనిలేకపోవడంతో ప్రభుత్వాలు కూడా వీటిని పట్టించుకోవడం మానేసింది. ఉత్సవమూర్తుల్లా ఉనికిచాటుకుంటూ అరకొర సిబ్బందితో ఈ కార్యాలయం నెట్టుకొస్తోంది.

కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయంలో ప్రస్తుతం ఇద్దరు జిల్లా ఉపాధి కల్పనాధికారులు క్లరికల్-1, టెక్నికల్-1, రీజనల్ ఎంప్లాయిమెంట్ అధికారి-1, జూనియర్ ఎంప్లాయిమెంట్ అధికారి-1, పలువురు సిబ్బంది విధులు చేపడుతున్నారు.

కలగా మారిన స్వయం ప్రతిపత్తి

గతంలో ఉపాధి కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు చేసుకున్న నిరుద్యోగులు వారి అర్హతలు, ఎంప్లాయిమెంట్ సీనియారిటీ ప్రకారం ప్రభుత్వం భర్తీ చేసే ఉద్యోగాలకు జాబితాలు ఇక్కడ తయారు చేసి నిరుద్యోగులకు కాల్ లెటర్లు పంపేవారు. ఉపాధి కార్యాలయం నుంచి ఇంటికి కాల్ లెటర్ వచ్చిందంటే నిరుద్యోగుల ముఖంలో ఉద్యోగం వచ్చినంత సంతోషం కలిగేది. ప్రస్తుతం ఏ విభాగానికి ఆ విభాగం ఉద్యోగాలు భర్తీ చేస్తుండడంతో ఉపాధి కార్యాలయాల పాత్ర మసకబారింది. స్వయంప్రతిపత్తి లేకపోవడంతో దిక్కుతోచని పరిస్థితిలో ఏంచేయాలో తెలియక అధికారులు గోళ్ల గిల్లుకుంటున్నారు.

ల్యాప్స్ కార్డులకు దక్కని రెన్యువల్ అవకాశం

గతంలో ఉపాధి కార్డులు డెడ్ (ల్యాప్స్) అయితే మూడేళ్లు, ఐదేళ్లకోసారి ప్రభుత్వం మళ్లీ రెన్యువల్‌కు అవకాశం ఇచ్చేది. ఈ ప్రక్రియను పూర్తిచేయడం ద్వారా పాత సీనియారిటీ వచ్చేటట్టు అవకాశం కల్పించేది. ప్రస్తుతం అటువంటి అవకాశాన్ని ప్రభుత్వం కల్పించడం లేదు. పదేళ్లుగా ఇటువంటి అవకాశాన్ని ప్రభుత్వాలు కల్పించకపోవడంతో నిరుద్యోగుల్లో మరింత నిర్లిప్తత ఏర్పడి అటుగా వెళ్లడానికి ఆసక్తి చూపడం లేదు.

ముగిసిన టెన్త్ మూల్యాంకనం

విశాఖపట్నం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి జవాబుపత్రాల మూల్యాంకనం బుధవారంతో ముగిసింది. ఈనెల మూడోతేదీన జ్ఞానాపురంలోని జూబ్లీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ప్రక్రియను ప్రారంభించారు. ఇతర జిల్లాల నుంచి 1,80,618 జవాబు పత్రాలు వచ్చాయి. తెలుగు సబ్జెకుకు సంబంధించి 17,462, సంస్కృతం 8,948, హిందీ 27,038, ఆంగ్లం 21,173, గణితం 28,539, నేచురల్ సైన్స్ 27,733, ఫిజికల్ సైన్స్ 23,721, సోషల్ స్టడీస్ 23,449, ఒకేషనల్ 2,107, హిందీ ఫస్టు లాంగ్వేజ్ 538 , ఓపెన్ స్కూల్ నుంచి 12,417 జవాబుపత్రాలు వచ్చాయి. మూల్యాంకనానికి 1,346 మంది టీచర్లు విధులు నిర్వహించారు. మూల్యాంకనం ప్రశాంతంగా ముగిసిందని మూల్యాంకనం సెంటర్ క్యాంపు అధికారి, జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. త్వరలో ఉద్యోగ విరమణ చేయనున్న పలువురు ప్రధానోపాధ్యాయులను డీఈవో సత్కరించారు.

మెడ్‌టెక్ జోన్‌లో స్టార్టప్‌లకు 'ఫోర్జ్' సహకారం



ఎంవోయూ పత్రాలతో మెడ్‌టెక్ జోన్ సీఈవో జితేంద్రశర్మ, ఫోర్జ్ సీఈవో విశ్వసహస్రనామం

ఉక్కు టౌన్‌షిప్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మెడ్‌టెక్ జోన్‌లో స్టార్టప్‌లకు అవసరమైన ఆర్థిక సాయం చేయడానికి ఫోర్జ్ ఇన్నోవేషన్స్ ముందుకువచ్చింది. దీనిపై ఇరు సంస్థల మధ్య బుధవారం ఎంవోయూ జరిగింది. ఈ సందర్భంగా మెడ్‌టెక్ జోన్ సీఈఓ జితేంద్రశర్మ మాట్లాడుతూ ఈ వ్యూహాత్మక సహకారం వైద్య సాంకేతిక రంగంలో కొత్త ఆవిష్కరణలకు దోహదపడుతుందన్నారు. స్టార్టప్‌లకు అవసరమైన ఎకో సిస్టమ్ ఏర్పాటు చేస్తామని, ఆవిష్కరణలను పరీక్షించుకుని, మెరుగుపరచుకోవచ్చునన్నారు. ఫోర్జ్ ఇన్నోవేషన్, వెంచర్స్ సీఈవో విశ్వసహస్రనామం మాట్లాడుతూ మెడ్‌టెక్ జోన్‌తో చేతులు కలపడం ఆనందంగా ఉందన్నారు. ప్రజారోగ్య వ్యవస్థకు ఇన్నోవేషన్ నెట్‌వర్క్‌ను నిర్మించాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టులో భాగస్వాములుగా చేరామన్నారు.

నగదు రహిత వైద్యసేవలందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్టీఆర్ ఆరోగ్య ట్రస్ట్ జిల్లా కో ఆర్డినేటర్ అప్పారావు

విశాఖపట్నం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ పరిధిలోని ఆస్పత్రుల్లో నగదు రహిత వైద్య సేవలు అందేలా చూడాలని ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.అప్పారావు ఆదేశించారు. ఆరోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం ఉదయం ఆరోగ్య మిత్రలతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్య మిత్రలు నెట్‌వర్క్ పరిధిలోని ఆస్పత్రుల్లో తప్పనిసరిగా బెడ్ సైడ్ విజిట్ చేయాలన్నారు. ఎఫ్ఆర్ఎస్ తప్పనిసరిగా వేయాలని సూచించారు. రోగులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ ఇబ్బందులు తెలుసుకోవాలన్నారు. వాటిని పరిష్కరించేందుకు కృషిచేయాలని, ట్రస్ట్ ఆదేశాలను పాటించాలని సూచించారు.

క్రేన్ పైనుంచి పడి కార్మికుడి మృతి

- షిప్‌యార్డులో ప్రమాదం



అప్పారావు (ఫైల్ ఫొటో)

మల్కాపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): షిప్‌యార్డు హల్‌షాప్ విభాగంలో ఉన్న క్రేన్‌పై పనిచేస్తున్న మాజీ సొసైటీ కార్మికుడు 50 మీటర్ల ఎత్తు నుంచి పడి మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం ఉదయం జరిగింది. వివరాలిలా ఉన్నాయి... గాజువాక ఆర్టీసీ డిపో వద్ద ఉంటున్న పిలక అప్పారావు (55) షిప్‌యార్డు మాజీ సొసైటీలో కార్మికుడు. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి హల్‌షాప్‌లో ఉన్న క్రేన్ తడిసిపోవడంతో కంపెనీ ఉద్యోగి క్రేన్‌ను శుభ్రం చేయాలని అప్పారావుకు సూచించారు. ఈ మేరకు అతడు క్రేన్‌పైకి వెళ్లి శుభ్రపరుస్తుండగా విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయాడు. వెంటనే అతడ్ని నగరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మల్కాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. షిప్‌యార్డులో జీపీఏ పథకం ప్రకటించిన రోజే అప్పారావు మృతి చెందడంతో పథకం ద్వారా మృతుని కుటుంబానికి రూ.20 లక్షలు అందించనున్నట్టు అధికారులు ప్రకటించారని పలువురు కార్మికులు పేర్కొన్నారు. మాజీ సొసైటీలో ఉన్న కార్మికులంతా మృతుడి కుటుంబానికి ఒకరోజు వేతనాన్ని విరాళంగా అందిస్తామని సొసైటీ నాయకులు తెలిపారు.

లియోటెక్ వేవ్ సంస్థపై ఫిర్యాదు

సీతంపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అక్కయ్యపాలెం శంకరమఠం రోడ్డులో గల లియోటెక్ సంస్థలో ఉద్యోగం పేరుతో డబ్బులు కట్టించుకుని పని చేయించుకున్నారని, ఆరు నెలలుగా జీతం ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని బాధితులలో ఇద్దరు నాలుగో పట్టణ పోలీసుస్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. తమకు జీతం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగం కోసం ఒక్కొక్కరు సుమారు రూ.1.25 లక్షలు చెల్లించినట్లు తెలిపారు. మొత్తం ఆరుగురు బాధితులలో ఇద్దరు ఫిర్యాదు చేయగా, విచారణ జరుపుతున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

'లులూ మాల్‌ను మరో ప్రాంతానికి మార్చాలి'

విశాఖపట్నం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఆర్‌కే బీచ్ సమీపంలోని ఏపీఐఐసీ స్థలంలో ఏర్పాటు చేయతలపెట్టిన లులూ మాల్, కన్వెన్షన్ సెంటర్‌లను మరో ప్రాంతానికి మార్చాలని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పూర్వ ఛైర్మన్ ప్రొఫెసర్ కేఎస్ చలం ముఖ్యమంత్రికి, పర్యాటకశాఖ మంత్రికి లేఖ రాశారు. ఆర్‌కే బీచ్‌లో లులూ మాల్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ప్రజాఉద్యమాలు నడిచాయని గుర్తుచేశారు. విశాఖ వాసులకు విశ్రాంతి, వినోదం లభించే ఆర్‌కే బీచ్‌లో మాల్, కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు చేస్తే ట్రాఫిక్, అనుబంధ వ్యాపారాలు పెరిగి గందరగోళం నెలకొంటుందన్నారు. అధిక వాహన రద్దీ సీఆర్‌జెడ్ నిబంధనలకు వ్యతిరేకంగా ఉంటుందని, పలు వ్యాజ్యాలకు, వివాదాలకు దారి తీసే అవకాశం ఉందని పేర్కొన్నారు. లులూ మాల్, కన్వెన్షన్ సెంటర్‌ల ఏర్పాటుకు ప్రత్యామ్నాయ స్థలాన్ని ఎంపిక చేయాలని ఆయన సూచించారు.

శేష వాహనంపై అప్పన్న తిరువీధి



శేష వాహనంపై మాడవీధుల్లో విహరిస్తున్న సింహాద్రినాథుడు

సింహాచలం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వార్షిక తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం సింహగిరి మాడవీధుల్లో సింహాద్రినాథుడు శేష వాహనంపై తిరువీధిలో విహరించారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో స్వర్ణాభరణాలు, పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించి శేషవాహనంపై అధిష్ఠింపజేశారు. విద్వాంసుల మంగళ వాయిద్యాలు, పండితుల వేద మంత్రోచ్చరణలు, కళాకారుల కోలాటాల నడుమ సందడిగా తిరువీధి ఉత్సవం సాగింది. భక్తులు ఫలాలు, కర్పూర నీరాజనాలిచ్చారు.

నేడు మాంసం దుకాణాలకు సెలవు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మహావీర్ జయంతి సందర్భంగా జీవీఎంసీ పరిధిలో గురువారం జంతువధ, మాంసం విక్రయాలను నిషేధించామని జీవీఎంసీ పశు నియంత్రణాధికారి డాక్టర్ ఎన్.కిశోర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ ఎం.ఎస్.హరేంధిర ప్రసాద్ ఆదేశాల మేరకు గురువారం జీవీఎంసీ పరిధిలో మటన్, చికెన్, చేపలు తదితర మాంసాహార దుకాణాలు తెరచి ఉంచరాదన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు, మేస్త్రీలు ఆయా సచివాలయాల పరిధిలో పర్యవేక్షించాలని ఆదేశించామన్నారు. ఎవరైనా దుకాణాలు తెరిచి, మాంసం విక్రయాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు అపరాధ రుసుం వసూలు చేస్తామని హెచ్చరించారు.

రెవెన్యూ సమస్యలపై వ్యూహాత్మకంగా వ్యవహరించాలి

- యంత్రాంగానికి కలెక్టర్ హరేంధిర ప్రసాద్ దిశా నిర్దేశం



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారంలో అధికారులు, సిబ్బంది వ్యూహాత్మకంగా వ్యవహరించాలని, పారదర్శకత లోపించకుండా, ప్రక్రియలు వేగవంతం చేయాలని కలెక్టర్ ఎంఎస్ హరేంధిర ప్రసాద్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి రెవెన్యూ వర్క్‌షాపులో వివిధ అంశాలపై మాట్లాడారు. రెవెన్యూ పరమైన అంశాలు, నిబంధనలు, జీవోలపై అవగాహన ఉండాలని, సవరణలు, మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సరళతర విధానంలో పనులు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణల తొలగింపుపై జీవోల అమలుకు అనుసరించాల్సిన విధానాలను వివరించారు. జీవో నెంబరు 30 ఆధారంగా పనులు చేపట్టాలని, రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతంచేయాలని సూచించారు. ఈ సందర్భంగా 30, 296, 388 జీవోల అమలులో సమస్యలను సిబ్బంది వివరించారు. ఈ సమావేశంలో రిజిస్ట్రేషన్‌శాఖ డీఐజీ బాలకృష్ణ, భీమిలి, విశాఖ ఆర్డీవోలు సంగీత్ మాధురి, పి.శ్రీలేఖ, సర్వేశాఖ ఏడీ సూర్యారావు, ఏవో ఈశ్వరరావు, తహసీల్దార్లు, డీటీలు పాల్గొన్నారు.